ఎన్నికల ప్రత్యేక అనుబంధ సంచిక

RNI Regd. APTEL No. 2009/29147 | Postal Regd. No. J/NLR/078/20-22

# ఆంధ్రలక్ష్మి


జాతీయ తెలుగు వార పత్రిక



సంపుటి : 15 | సంచిక : 34 | ఎడిటర్ : ఎస్.కె. గౌస్‌బాషా | తేది : 13-05-2024 | పేజీలు : 8 | వెల : 6/-

# బద్ధకాన్ని వీడి బాధ్యతగా ఓటేద్దాం..!

పనులుంటే వాయిదా వేసుకోండి. ప్రయాణాలుంటే రద్దు చేసుకోండి. షాపింగ్ అయితే ఇంకో రోజు పెట్టుకోండి. కానీ, పొద్దున్నే వెళ్లి ఓటేయండి! దూరమైతే బండి తీయండి. దగ్గరైతే నడిచే వెళ్లండి. నలతగా ఉంటే మాత్ర వేసుకోండి. కానీ, పొద్దున్నే వెళ్లి ఓటేయండి! ఓటరు ఐడీ దొరక్కపోతే.. ఆధార్ తీసుకెళ్లండి. అదీ కనిపించకపోతే.. పాన్‌కార్డు జేబులో పెట్టుకోండి. కానీ, పొద్దున్నే వెళ్లి ఓటేయండి! బ్రేక్‌ఫాస్ట్ గంటాగి చేయొచ్చు. కానీ, పొద్దున్నే వెళ్లి ఓటేసిన తర్వాతే అన్నీ..! ఎన్నికల రోజు 'అధికారిక సెలవు' కాదు. అధికారం ఎవరికివ్వాలో, సెలవు ఏ పార్టీకి ప్రకటించాలో మనం నిర్ణయించుకునే రోజు. ఓ ఐదు నిమిషాలు వరుసలో నిలబడటానికి బద్ధకిస్తే, మొత్తంగా ప్రజాస్వామ్యమే వరుస తప్పుతుంది. 'ఎందుకు ఓటెయ్యాలి?' అని నోరు పారేసుకునే వాళ్లంతా, ఐదేళ్లూ నోరు మూసుకుని బతకాల్సి వస్తుంది. మనం ఓటేయకపోయినా ఎవరో ఒకరు గెలుస్తారు. కానీ, మనం ఓడిపోతాం. ఆ పరిస్థితి రాకూడదు. ఓటుకు దూరం కాకూడదు. పోలింగ్ తేదీ గుర్తుంది కదూ. మే, 13... అనగా ఈరోజే..! చెరువు మాయమైంది. ఎవరి దాహం? కొండ కరిగిపోయింది. ఎవరి స్వార్థం? ఆనకట్ట కూలిపోయింది. ఎవరి అఘాయిత్యం? రహదారి శిథిలమైంది. ఎవరి చేతివాటం? భూకబ్జాలు పెరిగాయి. ఎవరి దురాశ? గూండాయిజం పెట్రేగింది. ఎవరి అసుర ప్రవృత్తి? భూతద్దం పట్టుకుని వెతకాల్సిన పన్లేదు. అంజనమేసి గాలించాల్సిన అవసరం లేదు. చిలక ప్రశ్నలూ గంటల పంచాంగాలతో సమయం వృథా చేసుకోవాల్సిన అగత్యమే లేదు. ఎదురుగా కనిపిస్తుంటారు. ఎదురులేదన్నట్టు రొమ్ము విరుచుకుని తిరుగుతుంటారు. వేదికల మీద దండలతో వెలిగిపోతుంటారు. చట్టసభల్లో మైకులు పట్టుకుని ఊగిపోతుంటారు. పదహారు బండ్ల కాన్వాయ్‌లో ఊరేగుతుంటారు. అధికార దర్పంతో చెలరేగుతుం




టారు. ఐదేళ్ల కాలానికి అగ్రిమెంటు రాయించుకున్నట్టు.. ప్రతి టెండరూ వాళ్లకే. ఏ సెటిల్‌మెంట్ అయినా వాళ్ల కనుసన్నల్లోనే. నగదు బదిలీ అయితేనే బదిలీలు. కప్పం కడితేనే పోస్టింగులు. మేధావులంటే గౌరవం లేదు. న్యాయస్థానాల పట్ల నమ్మకం లేదు. జనాభిప్రాయానికి విలువే లేదు. మంచి చూడరు. మంచి వినరు. మంచి మాట్లాడరు. రెండురెళ్లు నాలుగన్నా .. జైళ్లు నోళ్లు తెరుచుకుంటాయి. బద్నాం చేయడానికి బాడుగ గొంతుకలు సిద్ధంగా ఉంటాయి. బూతులు తిడతారు. మెటికలు విరుస్తారు. బురద చల్లుతారు. విద్వేషాల వరద పారిస్తారు. మేక రూపం, పులి స్వభావం. మెత్తని మాటలు, కత్తుల మూటలు. ఎవరు వీళ్లు? ఎక్కడి వాళ్లు? ఆకాశం నుంచేం ఊడిపడలేదు. పాతాళంలోంచేం పెల్లుబికి రాలేదు. మన నిర్లిప్తతలోంచి పుట్టుకొచ్చారు. మన నిర్లక్ష్యమే సోపానంగా ఎదిగిపోయారు. బలహీనమైన ఓటింగ్ శాతం వాళ్లను మరింత బలవంతుల్ని చేసింది. రాజకీయాలంటే అసహ్యమని కొందరు, అభ్యర్థుల పట్ల అపనమ్మకంతో కొందరు, పోలింగ్ కేంద్రాల వరకూ వెళ్లే ఓపికలేక కొందరు.. సగానికి సగం పౌరులు ఎన్నికల క్రతువులో పాల్గొనడం లేదు. మాట్లాడాల్సిన వాళ్లు మాట్లాడకపోతే డైనోసర్లు నోళ్లు తెరుస్తాయి. బుద్ధిజీవులు మేల్కొనకపోతే మూర్ఖులు చెలరేగిపోతారు. అదే జరుగు తోందిప్పుడు. మనం పాల్గొనని ఎన్నికల్లో, మనం వేయని ఓట్లతో.. ఎలాగోలా ఒడ్డున పడినవాళ్లు మన మీదే కర్రపెత్తనం చేస్తున్నారు. ఏటికేడాది వేళ్లూనుకుం టున్నారు. విషవృక్షంలా విస్తరిస్తున్నారు. అధికార మదంతో హూంకరిస్తున్నారు. జరిగిన నష్టం చాలు. భరించిన కష్టం చాలు. 'నా ఒక్క ఓటు ఫలితాలను మారుస్తుందా?' అని తేలిగ్గా తీసుకోవద్దు. అవును. ఒక్క ఓటు ఫలితాలను మార్చిన దాఖలాలు అనేకం. 'నేనొక్కడిని వెయ్యక పోతే కొంపలు మునుగుతాయా?' అనుకోవద్దు. నిజంగానే, కొంపలు మునుగుతాయి. ఆ మాటకొస్తే.. రాష్ట్రమూ, దేశమూ కూడా మునిగిపోతాయి. 'నా ఒంటికి పాలిటిక్స్ పడవు' అనే పలాయనవాదం వద్దు. అయినా, ఇదేమైనా వంకాయ కూరా? పడకపోతే పళ్లెంలోంచి తీసి పడేయడానికి. ఎన్నికలంటే.. నిన్నెవరు పాలిం చాలో నిర్ణయించుకోవడం. నువ్వెవర్ని వదిలించుకోవాలో తీర్మానించుకోవడం. 'పాలకుడంటే బలహీనులకు బలం' అంటాడు చాణక్యుడు. కానీ, ఇలాంటి నాయకులు.. తమ నియంతృత్వ ధోరణితో (తరువాయి 2వ పేజీలో)

# ఈ ఎన్నికల్లో గెలుపు పేదలదా...? పెత్తందార్లదా....?

బహుళ పార్టీ ప్రజాస్వామ్య విధానంలో ప్రజా సమస్యలు ఎన్నికల ఎజెండాగా మారడం లేదు. భావోద్వేగాలు, ప్రలోభాల మాటున ప్రజా సమస్యలు కనుమరుగవుతున్నాయి. ప్రజాస్వామ్య ఎన్నికల్లో జయాపజయాలు జనాధీనం అనేది పాత మాట. నేడు ధనాధీనం అనేది సరికొత్త పాటగా మారింది. జనం చైతన్యంతో ప్రలోభాలు, ఉచితాలు, తాయిలాల వలలో పడకుండా ప్రాధాన్యాల ప్రాతిపదికన ఏ పార్టీకి ఓట్లు వేయాలో వారికి వేస్తే గెలుపు ప్రజలది అవుతుంది. భావోద్వేగాలదో, ప్రలోభాలదో పైచేయి అయితే ప్రజాస్వామ్యం ఓడిపోతుంది. మన దేశ, రాష్ట్ర పౌరుల ఆకాంక్షలు, ఆశయాలకు ప్రాతినిథ్యం వహించే బాధ్యతాయుత ప్రజాస్వామ్య సాధనాలు రాజకీయ పార్టీలు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే బాధ్యతాయుత అధికారపక్షం.. అలాగే ప్రభుత్వాల పెడధోరణులను కట్టడి చేసి ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించగల ప్రతిపక్షం.. ఈ రెండూ ఆరోగ్యవంతమైన ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు. ఈ సున్నితమైన సమతూకం దెబ్బతింటే! ప్రజాస్వామ్య విలువలు,




ప్రమాణాలు గతి తప్పి అప్రజాస్వామికంగా, అనైతికంగా రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చే రాజకీయ దూషణలతో ఏకస్వామ్యంగా వ్యవహరిస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదం. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో క్రమేపి విశ్వసనీయత సన్నగిల్లిపోతుంది. తద్వారా ప్రజలు ఓటింగ్‌కు ప్రజలు దూరం అవుతారు. ఇది భిన్నత్వంలో ఏకత్వ సాధన కోసం ఏర్పడిన మన ప్రజాస్వామ్య దేశానికి క్షేమం కాదు. తొలి సార్వత్రిక ఎన్నికల్లో (1951-52) మనదేశంలో ఓటర్ల సంఖ్య 17.32 కోట్లు. గడిచిన ఏడున్నర దశాబ్దాలలో ఏకంగా ఐదున్నర రెట్లు పెరిగిపోయి నేడు 97 కోట్ల మంది ఓటర్లుగా నమోదైన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. అయితే, ఓటర్లు పెరుగుతున్నా పోలింగ్ శాతం మాత్రం నిరాశాజనకంగానే ఉంటుంది. 2019లో లోకసభ ఎన్నికల్లో దాదాపు 30 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు. వారిలో వలస కూలీలు, పట్టణ నగర వాసులు, యువత అధికంగా ఉన్నారు. దీని మూలంగా గత సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 67.40 శాతం మాత్రమే పోలింగ్ అయ్యింది. 50 పార్లమెంట్ నియోజకవర్గాల్లో జాతీయ సగటు కన్నా తక్కువగా ఓట్లు పోలయ్యాయి. మన రాష్ట్రంలోని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి అలాగే మహారాష్ట్రలోని పూణే, కళ్యాణ్ వంటి చోట్ల కనీసం 50% ఓటర్లైనా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యం కాలేదు. ఇలా గత ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ శాతం నమోదైన 266 లోకసభ స్థానాలపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఇప్పుడు ప్రత్యేక కార్యాచరణతో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ప్రజల్లో అవగాహన, ప్రచారంపై దృష్టి సారించింది. ఈసీ అన్ని ఏర్పాట్లు చేసినా ఓటింగ్ శాతం తగ్గుతుందంటే లోపం ఎక్కడుంది?

(తరువాయి 7వ పేజీలో)

# అలవికాని ఉచితాలు...అభివృద్ధికి అవరోధాలు..!

ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకొని, ఓట్లు రాబట్టుకొనేందుకు నేడు నాయకులు సంక్షేమం పేరుతో అంతులేని, అలవికాని ఉచిత పథకాలను ప్రకటిస్తున్నారు. ఒక పార్టీకి మించి మరో పార్టీ, ఎవరికి తోచిన విధంగా వారు మ్యానిఫెస్టోల్లో వీటిని గుప్పిస్తున్నారు. రానురాను ఈ పోకడలు మితిమీరి పోతున్నాయి. నేడు పార్టీలన్నీ ప్రలోభాలతోనే ప్రభంజనాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వాలు జనాన్నిఉచితాల ఆశల తాత్కాలిక లబ్ధి కలిగించే పథకాలతో ఏమార్చుతున్నాయి. సాధ్యాసాధ్యాలు, యోగ్యాయోగ్యాలు పరిశీలించకుండా ప్రకటించే ఈ పథకాలు రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థలను నిర్వీర్యంచేసి, భవిష్యత్తులో విధిగా జరగాల్సిన అభివృద్ధి పనుల్ని కుంటుపరుస్తాయనే విషయాన్ని పాలకులు విస్మరిస్తున్నారు. అవి సమాజ పురోగతికి దోహదపడే నిర్మాణాత్మకమైన కార్యక్రమాలను గాలికొదిలేసి, కొన్ని వర్గాలకు తాత్కాలిక ప్రయోజనాలను కల్పిస్తే అది అభివృద్ధి అవుతుందా? నేడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం ఉన్నాయి. విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, రహదారుల వంటి మౌలిక వసతులు కరువై నానా ఇక్కట్లు పడుతున్నారు. పాలకులు వీటిపై దృష్టి సారించకుండా కేవలం ఉచిత పథకాలకే ప్రాధాన్యం కల్పించడం ఎంతవరకు సబబు? ప్రజలకు ముఖ్యంగా కావల్సింది నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, తాగునీరు. దేశంలో తాగడానికి మంచి నీరు లేని గ్రామాలు నేటికీ 30శాతం ఉన్నాయి. వేసవి కాలంలో నీటి కటకట చాలా ప్రాంతాల్లో ఏటికేడు పెరిగిపోతోంది. రోడ్ల పరిస్థితి చూస్తే ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో అధ్వానంగా ఉంది. సరియైన రహదారులు, రవాణా సౌకర్యాలు లేక ప్రజలు పడే ఇబ్బందులు చెప్పనలవికాదు. కొన్ని గిరిజన ప్రాంతాల్లో అయితే వైద్యం కోసం పది, పదిహేను కిలోమీటర్ల దూరం వాగులు, వంకలు దాటుకుంటూ వెళ్ళాల్సిన దుస్థితి నెలకొంది. అత్యవసర అనారోగ్య పరిస్థితులలో కూడా అంబులెన్స్‌లు సైతం రాక ప్రజలు మృత్యువాత పడుతున్నారు. కానీ ఇవేవి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వాలు చేపట్టాల్సిన దీర్ఘకాలిక అభివృద్ధి కార్యక్రమాలు అనేకం ఉంటే, వాటిని పక్కనపెట్టి ప్రజలను తాత్కాలిక తాయిలాలతో ఊరడిస్తున్నారు పాలకులు. నిరుపేదలకు, వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు సామాజిక పింఛన్లు ఇవ్వడమనేది సహేతుకమైన చర్యే. అది సామాజిక భద్రతా పథకాల్లో భాగంగా ప్రభుత్వం విధిగా నిర్వర్తించాల్సిన కర్తవ్యం కూడా. అలాగే అష్టకష్టాలు పడుతున్న అన్నదాతలకు కల్పించే పథకాలూ హేతుబద్ధమైనవే. వీటిని ఎవ్వరూ కాదనలేరు. కానీ, ఓట్ల కోసం కులాలు, మతాలు, వృత్తులు, మహిళల వారీగా రకరకాల పేర్లతో ఉచిత నగదు పథకాలను రూపొందించి అమలు చేయడం, ప్రభుత్వ నిధులను ఇష్టం వచ్చినట్లు ఖర్చుపెట్టడం హర్షణీయం కాదు. దీనివల్ల ప్రజాస్వామ్య ఫలాలు అందరికీ సమంగా దాఖలుపడాలన్న రాజ్యాంగ స్ఫూర్తి మధ్యతరగతి ప్రజల విషయంలో నీరుగారిపోతోంది. కష్టార్జితంలో కొంత భాగాన్ని పన్నుల రూపంలో చెల్లిస్తున్న సామాన్య పౌరులకు సంక్షేమం దక్కకుండా పోతోంది. పైగా పెరిగే ధరలు, కరెంట్ చార్జీలు, ఇంటిపన్నుల వంటి భారాలతో మధ్యతరగతి ప్రజలు సతమతమవుతున్నారు. వీరి ఆర్థిక అభ్యున్నతిని ప్రభుత్వాలు విస్మరిస్తే, వీరికి సంక్షేమ ఫలాలు దక్కేదెలా? ఒక పద్ధతి, క్రమంలేని నిర్హేతుక ఉచిత పథకాలను అమలు చేయడం ప్రభుత్వాలకు తలకు మించిన భారం అవుతోంది. ఇవి ఆర్థిక వనరులను హరించేసి, ప్రభుత్వాలను అప్పులపాలు చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలను గమనిస్తే, ఇక్కడ గడచిన పదేళ్ళలో లక్షల కోట్లు వివిధ ఉచిత పథకాలకోసం వెచ్చించారు. ఇష్టానుసారంగా అప్పులు చేసి, రాష్ట్రాన్ని రుణభారంలోకి నెట్టివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర పన్నుల ద్వారా మరియు కేంద్రం నుంచి వచ్చే జీఎస్టీ వాటాల ద్వారా జమకూడే ఆర్థిక వనరులే గాకుండా రకరకాల మార్గాల్లో అప్పులు తెచ్చి సింహభాగం ఉచిత పథకాలకే వెచ్చించి, తీవ్రమైన ఆర్థిక భారంతో ఆంధ్రప్రదేశ్ కొట్టుమిట్టాడుతోంది. నేడు విద్యా వైద్యాల పరంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉచిత సేవలు ప్రభుత్వరంగంలో లభించడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందక ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రజలందరికీ నాణ్యమైన విద్య, వైద్య సేవలు అభివృద్ధిలో భాగంగా అందించాల్సిన బాధ్యత పాలకులపై ఎంతైనా ఉంది. ప్రతి మండల, జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వం అత్యాధునిక వసతులతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను నిర్మించి పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించితే, పేదలను ఆరోగ్యశ్రీ పథకాల వంటిద్వారా కార్పొరేట్ ఆసుపత్రులకు పంపించాల్సిన అవసరం ఉండదు. తద్వారా ప్రభుత్వాలకు కోట్లాది రూపాయిలు ప్రైవేటు ఆసుపత్రులకు చెల్లించాల్సిన భారమూ ఉండదు. ప్రజలు ఆర్థికంగా అభ్యున్నతి చెందాలంటే విద్య, వైద్యాలతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కూడా పెంపొందించాలి. దానికిగాను విరివిగా పరిశ్రమలు ముఖ్యంగా తయారీ రంగంలో నెలకొల్పాలి. తయారీరంగం అభివృద్ధి చెందితే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు అధిక సంఖ్యలో పెరుగుతాయి. దాంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే గాక, ప్రభుత్వాలకు పన్నుల రూపేణా ఆదాయం కూడా పెరుగుతుంది. నిరుద్యోగ సమస్యను పరిష్కరించి, ఉపాధి కల్పించి, ప్రజలు అభివృద్ధి సాధించే దిశగా సంక్షేమ చర్యలు ఉండాలిగాని అప్పులు చేసి, పన్నులు పెంచి ఉచితాల రూపంలో పంచే పథకాలు కాదని పాలకులు గ్రహించాలి.

# బద్ధకాన్ని వీడి బాధ్యతగా ఓటేద్దాం..!

(1వ పేజీ తరువాయి)

బలహీనుల్ని మరింత బలహీనంగా మారుస్తున్నారు. వ్యవస్థలన్నింటినీ గుప్పిట్లో పెట్టుకుని అవ్యవస్థను సృష్టిస్తున్నారు. ఆ అరాచకానికి అడ్డుకట్ట వేయాలంటే.. ఒకటే మార్గం. ఏ ఓటరూ ప్రజాస్వామ్య యజ్ఞానికి దూరంగా ఉండకూడదు. ఏ ఓటూ వృథాగా మురిగిపోకూడదు. ఏ ఎడమచేతి చూపుడు వేలూ సిరా చుక్క లేకుండా చిన్నబోకూడదు. ఓటు.. రెండువైపులా పదునుదేలిన కత్తి. మంచిని గెలిపిస్తుంది. చెడును ఓడిస్తుంది. ఆయుధం సిద్ధం. మీదే ఆలస్యం. మధ్యతరగతి ఓ వింత వలయంలో చిక్కుకుపోయింది. అవకాశాల వెంట పరుగులు తీస్తోంది. సంపాదనే సర్వస్వమన్నట్టు బతికేస్తోంది. చకచకా కార్పొరేట్ నిచ్చెనలు ఎక్కేయాలని ఆరాటపడుతోంది. ఎదిగే స్వేచ్ఛ ఎవరికైనా ఉంటుంది. కానీ, ఆ పరుగులో పడిపోయి సామాజిక బాధ్యతను మరువకూడదు. ఓటు హక్కును విస్మరించకూడదు. చాలా సందర్భాల్లో మధ్యతరగతి కాలనీల్లో ఓటింగ్ సందడే కనిపించదు. గేటెడ్ కమ్యూనిటీల గేట్లు ఓ పట్టాన తెరుచుకోవు. కాబట్టే, మహానగరాల్లో పోలింగ్ యాభై శాతానికి మించదు. ఈ నిర్లక్ష్యం, నిర్లిప్తతల కారణంగా ఏ అనర్హుడో అందలమెక్కుతాడు. అందినకాడికి దండుకుంటాడు. అందులోనూ.. ఎదిరించే శక్తి కానీ, నిలువరించే సామర్థ్యం కానీ లేని మిడిల్‌క్లాస్‌ను లక్ష్యంగా చేసుకుంటాడు. చిట్టీలు వేసో, పొట్ట కట్టుకునో కొనిపెట్టుకున్న జాగాలను నిర్లజ్జగా కబ్జా చేస్తాడు. ఇక, బతికినంత కాలం కోర్టుల చుట్టూ తిరగాల్సిందే. బిల్డర్లను గుప్పిట్లో పెట్టుకుని అపార్ట్‌మెంట్ల ధరలు అమాంతం పెంచేస్తాడు. పాతికేళ్లలో తీరాల్సిన బ్యాంకు రుణం ముప్పై ఏళ్లయినా ముప్పు తిప్పలు పెడుతూనే ఉంటుంది. ఆ అరాచకం అక్కడితో ఆగదు. పార్టీ ఫండ్ కోసం, ఎన్నికల ఖర్చుల కోసం కార్పొరేట్ కంపెనీలకూ రేట్లు ఫిక్స్ చేస్తాడు. కాదంటే కష్టాలు మొదలవుతాయి. ఇవ్వడం అలవాటు చేస్తే.. లాభాల్లో వాటాల వరకూ వెళ్తుంది వ్యవహారం. ఆ ఒత్తిడిని భరించలేక.. దుకాణం సర్దేసి.. మరో నగరానికో, దేశానికో వెళ్లిపోతాయా సంస్థలు. ఆ దెబ్బ నేరుగా మధ్యతరగతి మీదే పడుతుంది. మళ్లీ సున్నా నుంచి మొదలుపెట్టాలి. కొత్త కొలువులు వెతుక్కోవాలి. ఇదంతా ఓటును చులకన చేసిన ఫలితమే. చేజేతులా ఎన్నికల్ని దూరం చేసుకున్న ప్రభావమే. అయినా.. శివార్లలో స్థలాలు కొన్నంతమాత్రానో, ఖరీదైన కాలనీలో ఇల్లు కట్టినంత మాత్రానో, బీరువాల నిండా వెండి–బంగారాలు దాచిపెట్టినంత మాత్రానో .. పిల్లలకు మంచి భవిష్యత్తును ఇచ్చినట్టు కాదు. వాళ్లకంటూ ఓ సురక్షితమైన సమాజాన్ని నిర్మించి ఇవ్వాలి. ఆ కట్టడానికి పునాది ప్రజాస్వామ్యం. ఆ ప్రజాస్వామ్యానికి పునాది ఓటు. ఆ ఓటును విజన్ ఉన్న నేతకే వేయాలి. అనుభవ సంపన్నుడినే గెలిపించుకోవాలి. నాయకుడంటే కూల్చేవాడు కాదు, కట్టేవాడు. అది సకల సౌకర్యాలతో విలసిల్లే.. రాజధాని కావచ్చు. వేలాది కొలువులకు నెలవైన సాంకేతిక నగరీ కావచ్చు. నాయకుడంటే ఉద్వేగాలతో విద్వేషాలు ఎగదోసేవాడు కాదు. ఉద్యమస్ఫూర్తితో భవితకు బాటలు వేసేవాడు. పరిశ్రమలు తెచ్చేవాడు. ప్రపంచ పాలకుల దృష్టిని ఆకర్షించేవాడు. మన నాయకుడే మన బ్రాండ్ అంబాసిడర్. నేర చరిత్ర ఉన్నవాడు కావాలా? కొత్త చరిత్ర సృష్టించేవాడు రావాలా? 'ఊళ్లో ఆస్తిపాస్తులేమైనా ఉన్నాయా?' అని ఎవరైనా అడిగితే.. 'ఓ ఆస్తి ఉంది. కావాలంటే చూడండి' అంటూ జేబులోంచి ఓటరు ఐడీ తీసేవారు ఎంతోమంది. సొంతూరి ఓటర్ లిస్ట్‌లో పేరుంటేనే పక్కా లోకల్ అయినట్టు. పల్లెతో అనుబంధం ఉన్నట్టు. ఆ ఒక్క కారణంతోనే.. ఆ వలస ఓటర్లంతా సొంతూళ్లకు వెళ్లిరావాల్సిన సమయం రానేవచ్చింది. ఏ కారణంగా ప్రయాణం రద్దు చేసుకున్నా.. ఓటు వృథాగా పోతుంది. పరోక్షంగా, సమర్థుడిని ఓడిస్తుంది. ఓటు దుర్వినియోగం అవుతుంది. ప్రత్యక్షంగా, అసమర్థుడిని గెలిపిస్తుంది. ఈ రెండు తప్పులూ ప్రజాస్వామ్యానికి పెనుముప్పులే. ఆరునూరైనా ఓటు యాత్రకు బయల్దేరాల్సిందే. ఏదో ఒక వాహనం ఎక్కేయండి. తెల్లారేలోపు ఊళ్లో వాలిపోండి. వీలైతే ఓ పూట ముందే చేరుకోండి. పల్లె పరిస్థితుల్ని వాకబు చేయండి. స్థానిక రాజకీయాల్ని బేరీజు వేసుకోండి. పచ్చని గ్రామంలో చిచ్చు రేపిందెవరో, ప్రకృతి విధ్వంసానికి మూలాలెక్కడో నిగ్గుతేల్చండి. భూమి తల్లికి గర్భస్రావం చేసి మరీ.. ఇసుక నుంచి ఇనుము దాకా సర్వం తోడేస్తున్న తోడేళ్ల వెనుక ఎవరున్నారో తెలుసుకోండి. ఐదేళ్లలో కరెంటు చార్జీలు ఎన్నిసార్లు పెరిగాయో లెక్క తీయించండి. ఆల్కహాల్ పేరుతో సీసాలకొద్దీ హాలాహలాన్ని అంటగడుతున్నదెవరో బట్టబయలు చేయండి. పంచభూతాలనూ వాటాలేసుకుని పంచుకున్న రాజకీయ దళారుల కళ్లు.. సామాన్యుల భూముల మీదా పడుతున్నాయి. పేదలనే కనికరం లేకుండా.. ఎకరమూ, అరెకరమూ సైతం వదలకుండా మింగేస్తామంటున్నారు. న్యాయం కోసం కోర్టుకు వెళ్ళే అవకాశమూ లేకుండా చేస్తామంటున్నారు. అదే జరిగితే.. రైతుల నోట్లో మట్టే. బతుకులు బజారున పడినట్టే. చట్టాల ముసుగులో జరుగుతున్న ఈ సర్కారీ దోపిడిని అడ్డుకోండి. సమగ్ర సత్యశోధన తర్వాతే, మీ తీర్పును ఇవ్వండి. ఎవరో సమకూర్చే వాహనం ఎక్కొద్దు. ఎవరో అందించే అతిథి మర్యాదలకు ఆశపడొద్దు. గ్రామదేవత జాతరకు వెళ్లినంత ఇష్టంగా, ఇలవేల్పు ఉత్సవాల్లో పాల్గొన్నంత భక్తిగా, ఆత్మీయుల పెళ్లికి హాజరైనంత బాధ్యతగా ఓటు యజ్ఞంలో పాల్గొనండి. ఓటు దారి తప్పితే.. గ్రామం పట్టుతప్పుతుంది. అదే అవకాశంగా నాయకులు పావులు కదుపుతారు. మనుషుల్ని విభజిస్తారు. విద్వేషాల్ని రగిలిస్తారు. ప్రేమలు ఉప్పొంగిన చోటే రక్తం పారుతుంది. ఊరు వల్లకాడు అవుతుంది. మీ పల్లెను బతికించుకోవాలంటే మీ ఓటును వినియోగించుకోవాల్సిందే. ప్రభుత్వ ఉద్యోగం మీ లక్ష్యమైతే.. ఏ నోటిఫికేషన్ ఎప్పుడు ఇవ్వాలో నిర్ణయించేది అతనే. లీకేజీలు లేకుండా పరీక్షలు జరపాలన్నా, ప్రలోభాలకు అతీతంగా నియామకాలు జరగాలన్నా.. నిజాయితీ పరుడినే గెలిపించుకోవాలి. లంచాలతో పనేలేకుండా పర్మిషన్లు రావాలన్నా, కమీషన్లు ఇవ్వకుండానే సబ్సిడీలు అందాలన్నా సమర్థుడినే పీఠం ఎక్కించాలి. మీ ఓటు పైపైకి ఓ నియోజకవర్గానికి పరిమితమైనట్టు కనిపించినా, అంతిమంగా దేశాన్నంతా ప్రభావితం చేస్తుంది. అసెంబ్లీ ఎన్నికలైతే.. మనం గెలిపించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రిని ఎన్నుకుంటాడు. శాసనసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్లను ఎన్నుకుంటాడు. మూడోవంతు ఎమ్మెల్సీలను శాసనమండలికి పంపుతాడు. రాజ్యసభ సభ్యులనూ రాష్ట్రపతినీ ఎన్నుకుంటాడు. పార్లమెంటు ఎన్నికలైతే.. మనం ఓటేసిన ఎంపీ దేశ ప్రధానికి ఎన్నుకుంటాడు. లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్లను ఎన్నుకుంటాడు. రాష్ట్రపతి– ఉపరాష్ట్రపతుల ఎన్నికలో పాల్గొంటాడు. అలా మన ఓటు.. జాతీయ రాజకీయాలనూ శాసిస్తుంది. నాలుగు ఆఫర్ లెటర్లు చేతిలో ఉన్నప్పుడు, అందులోంచి అత్యుత్తమ కంపెనీనే ఎంచు కున్నట్టు.. నలుగురైదుగురు అభ్యర్థుల్లోంచి తిరుగులేని నాయకుడినే ఎన్నుకోండి. సిస్టమ్‌లోని మాల్‌వేర్‌ను డిలీట్ చేసినంత నేర్పుగా అసమర్థులను ఓడగొట్టండి. ఓటు.. దేశాన్నీ, రాష్ట్రాన్నీ పాలించడానికి పాస్‌వర్డ్. సరైన వ్యక్తికే ఇవ్వాలి. ఎలక్షన్లు.. ప్రపంచంలోనే అతిపెద్ద డెమొక్రటిక్ ఈవెంట్. తప్పక పాల్గొనాలి. ఓటింగ్.. క్రికెట్‌ను తలదన్నే ఉత్కంఠభరితమైన పోరు. ప్రేక్షకుడిగా మిగిలిపోకూడదు. ఆటగాడిగా దుమ్మురేపాలి. పోలింగ్ పర్సెంటేజీని శతకానికి చేరువ చేయాలి. మంచిని గెలిపించే ప్రతి ఓటరూ మ్యాన్ ఆఫ్ ది మ్యాచే! మండుటెండ మనిషిని వణికిస్తుంది. ఒళ్లంతా చెమటలు పట్టిస్తుంది. సత్తువనంతా లాగేస్తుంది. వడదెబ్బకు గురిచేస్తుంది. అంతే, అంతకు మించి ఏమీ చేయలేదు. అదే అవినీతిపరుడి దెబ్బ.. వేయి వడదెబ్బలకు సమానం. పొరపాటున గెలిచాడా.. ఐదేళ్లూ ఆ ప్రాంతం నిప్పుల కొలిమే. అరాచకం నీటి కరవులా బతుకుల్ని ఎండగొడుతుంది. దోపిడి డీహైడ్రేషన్‌లా వ్యవస్థను బలహీనపరుస్తుంది. ఎండకు రోళ్లు పగిలినట్టు.. తలకాయలు తెగుతాయి. ఆ భగభగలపై.. బాధ్యత కలిగిన పౌరుడి వారుణాస్త్రం – ఓటు హక్కు.

# బీజేపీకి 400 సీట్లు రాజ్యాంగ సవరణకేనా..?

గత కొంతకాలంగా, రాజ్యాంగాన్ని మార్చడం అనే అంశం వార్తలలో నలుగుతుంది. పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఈ వార్త మరింత వేడిని పెంచిందనే చెప్పాలి. దీనితో ముడిపడి ఉన్న రిజర్వేషన్ల రద్దు తేనె తుట్టెను మళ్లీ కుదిపినట్టయింది. రాజ్యాంగాన్ని మారుస్తాం! అన్న ప్రచారంతోనే ఈ సమస్యకు బీజం పడింది. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ. తదితర వర్గాలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రమాదంలో పడుతుందనే భావన ప్రజల్లోకి బలంగా వెళ్ళింది. ఒక్కమాటలో చెప్పాలంటే రాజ్యాంగాన్ని మార్చడం అంటే, డాక్టర్ అంబేద్కర్ ఆలోచనలతో ఢీకొట్టడమే కాగలదు. ఇది అంత ఆషామాషీ వ్యవహారం కాదు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఈ అంశంపై, రాజకీయ పార్టీలు తమ వైఖరిని తక్షణం స్పష్టం చేయాల్సిన పరిస్థితి అనివార్యమైంది. ప్రస్తుతం రాజకీయ పార్టీల ముందున్న అతి పెద్ద సవాలిదే. రాజ్యాంగం రద్దు విషయం కీలకమైనందున ఈ సమస్య జాతీయ ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ విషయంపై కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అధినాయకత్వం రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, రాజ్యాంగాన్ని మార్చమని ప్రకటిస్తుంటే, క్రింది స్థాయి మంత్రులు, వివిధ పదవులలో ఉన్నవారు రాజ్యాంగాన్ని మారుస్తాం, రిజర్వేషన్లు తొలగిస్తాం అంటున్నారు. వీరిలో మరికొంత మంది ముస్లింలకు ఇచ్చిన రిజర్వేషన్ మాత్రమే తొలగిస్తామని అంటున్నారు. అయితే, కర్ణాటకలో ముస్లింలు రిజర్వేషన్లు తగ్గించి, దాన్ని లింగాయత్‌లకు కేటాయించిన విషయం మరువరాదు. మతం, కులం, రిజర్వేషన్ల అంశం దేశంలోని వివిధ ప్రాంతాల్లో (రాష్ట్రాల్లో) పరిస్థితులకు వేరువేరుగా ఉన్నాయి. ఒకే విధమైన నిదానంతో సమస్యలను పరిష్కరించడం సాధ్యం కాదు. జమ్మూ కాశ్మీర్, తమిళనాడు, కేరళ, తెలుగు రాష్ట్రాలు ఇలా ఒక్కో రాష్ట్రంలో ఈ సమస్య ఒక్కో విధంగా ఉంది. అందుకనే దేశవ్యాప్త ఎన్నికలకు, జాతీయ పార్టీలకు ఒకే నినాదం అన్నది జటిలంగా మారింది. దేశంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెద్ద ఎత్తున జరుగుతుండటంతో, రిజర్వేషన్ల అమలు సమస్య చర్చకే రాని పరిస్థితి ఏర్పడింది. రాజ్యాంగంలో కల్పించబడిన అవకాశాలు సరిగా అమలు కావడం లేదని బహుజనులు, దళిత ఆదివాసీలు, మైనారిటీలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ రంగం బలహీనపడితే, రాజ్యాంగ సవరణ లేకుండానే ఆటోమేటిగ్గా రిజర్వేషన్లు రద్దయిపోతాయి. కానీ, ఈ మౌలికాంశం పెద్దగా చర్చకు రాకపోవడం శోచనీయం.




సాంకేతికత, వృత్తి నైపుణ్యత ప్రధానంగా ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటు పరమవుతుండగా, అంతంత మాత్రంగా మిగిలిన సంస్థలలో ఉన్న ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఏపాటివి. జనాభా దామాషా ప్రకారం విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు లభించడం లేదు. సమాజంలో పెరుగుతున్న హింస హెచ్చుమీరి, సామాన్య ప్రజల జీవించే హక్కు మృగ్యమై కేవలం పుస్తకాలలో నిద్రాణమై ఉన్నదన్న విషయం విధితమే. అందుకే ఇది అన్ని రాజకీయ పార్టీలకు చాలా చిక్కు సమస్య. అంత తేలిగ్గా అర్థం అయ్యేది కాదు. ఈ సమస్యను ప్రధాన ఎజెండాగా, నినాదంగా మార్చి, ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రతిపక్ష రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. ఒకవేళ పాలక పార్టీలు ప్రజల మౌలిక సమస్యలను చర్చించకుండా, మరుగున పెట్టేందుకు రాజకీయ పార్టీలు ఉద్దేశపూర్వకంగా రాజ్యాంగ రద్దు, రిజర్వేషన్ల రద్దు అంశాలను తెరపైకి తెచ్చారా? అన్న అనుమానాలు కూడా బహుళంగానే వినిపిస్తున్నాయి. ఈ విషయాల పట్ల బుద్ధి జీవుల పాత్ర నామమాత్రంగానే కనబడుతున్నది. భారతదేశంలో రాజ్యాంగ రద్దు, రిజర్వేషన్ల రద్దు సమస్య అంత ఆషామాషీగా జరిగేది కాదు. రాజ్యాంగాన్ని మార్చాలంటే ప్రాథమికంగా పార్లమెంటులో రెండింట మూడు వంతుల సభ్యుల ఆమోదం పొందాలి. కొన్ని సందర్భాల్లో పార్లమెంట్, అసెంబ్లీలు రెండింటిలో ఆమోదం పొందాల్సి వస్తుంది. ఇలా ఎన్నో విధానపరమైన సమస్యలు ఉంటాయి. ఇదేమీ అంత తేలికగా పరిష్కారం అయ్యే అల్లాటప్పా వ్యవహారం కాదు. అందుకేనేమో బీజేపీ తన బలగాన్ని పెంచుకునేందుకు, పార్లమెంట్ ఎన్నికల్లో 400 స్థానాల్లో గెలిపించాలని కోరుతుందనే అనుమానం బలపడుతోంది.

# ఎన్నికల అఫిడవిట్‌లో.. సీలింగ్ యాక్ట్ చట్ట ప్రభావం

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి, ఎన్నికల నియమావళి ప్రకారం ప్రమాణ పత్రం అఫిడవిట్ జతపరచాల్సి వస్తుంది. అందులో తమపైన కేసులు, తమకే కాకుండా తమ కుటుంబ సభ్యుల స్థిర చరాస్తుల వివరాలతో పాటు అప్పుల వివరాలను కూడా తెలియపరచాలి. అందులో ముఖ్యంగా తమకు తమ కుటుంబ సభ్యులకు గల వ్యవసాయ భూమి వివరాలు, సర్వే నెం, విస్తీర్ణంతో సహా పొందుపరచాలి. అయితే ఆ వివరాలపై భూగరిష్ట పరిమితి చట్టం నిబంధనలు ఏ మేరకు ప్రభావం చూపుతాయన్న విషయాన్ని పరిశీలించడమే కాకుండా, అవి సరిగా లేకుంటే చట్ట నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చరిత్రలోకి వెళితే, కొంతమంది చేతులలోనే ఎక్కువ శాతం భూమి ఉంటున్న నేపథ్యంలో, కుటుంబానికి నిర్ణిత భూగరిష్ట పరిమితి విధిస్తూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, నాటి ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావు భూ గరిష్ట పరిమితి చట్టాన్ని (ఏపీ ల్యాండ్ రిఫార్మ్స్ సీలింగ్ ఆన్ అగ్రికల్చర్ హోల్డింగ్ యాక్ట్) 1973 ప్రవేశపెట్టారు. అందుకుగాను తన సీఎం పదవిని ఆయన త్యాగం చేయవలసి వచ్చింది. ఆ చట్టం నిబంధనల మేరకు, ప్రతి భూ యజమాని, 20 ఎకరాలపైన వ్యవసాయ భూమి కల్గి ఉన్న వారందరూ, సెక్షన్ 8 ప్రకారం డిక్లరేషన్‌ని (నిర్ణీత ఫారంలో) సంబంధిత సీలింగ్ ట్రిబ్యునల్‌కు సమర్పించాలి. అంతేగాక అందులో తన, తన కుటుంబ సభ్యుల భూ వివరాలు పొందుపరచాలి. కుటుంబ నిర్వచన ప్రకారం, యజమాని, భార్య, ముగ్గురు పిల్లలను ఒక కుటుంబంగా పరిగణిస్తారు. భూమి ఫెర్టిలిటీని బట్టి భూమిని విభజించి, డ్రై భూమి అయితే ఒక కుటుంబానికి 50 నుండి 54 ఎకరాల వరకు అలాగే తరి (వెట్) భూమి అయితే సుమారు 20 నుండి 25 ఎకరాల వరకు ఒక ప్రామాణిక గరిష్ట పరిమితి విధించి, అంతకన్నా ఎక్కువ భూమిని చట్ట నిబంధనల మేరకు మిగులు భూమిగా ప్రకటించి, దానిని ప్రభుత్వం స్వాధీన పర్చుకోవడమే గాకుండా, అట్టి మిగులు భూమిని



గ్రామంలో ఉన్న, భూమి లేని నిరుపేదలకు (sc,st,bc నిష్పత్తి ప్రకారం) గరిష్టంగా 5 ఎకరాల వరకు భూ పంపిణీ చేయడం జరిగింది. చట్టం అమలులోకి వచ్చిన తర్వాత, వేల ఎకరాలను స్వాధీన పరుచుకొని నిరుపేదల కుటుంబాలకు పంపిణీ చేయడమైనది. అయితే ఆ మిగులు భూమిని, కేవలం వ్యవసాయం కోసం, గ్రామ హస్త కళాకారులకు ఇళ్ల స్థలాల కోసం మాత్రమే కేటాయించాలని చట్టంలో స్పష్టంగా చెప్పారు. కానీ అలాంటి మిగులు భూమిని సెజ్‌లకు, సంస్థలకు కూడా కేటాయించవచ్చని వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చట్టంలో అమెండ్‌మెంట్ తీసుకురావడమే కాకుండా, మిగులు భూమిని వాటికి కేటాయించారు కూడా. ఇలాంటి అమెండ్‌మెంట్ ఎంత వరకు చట్టబద్ధం అన్న విషయం ఎవ్వరూ చాలెంజ్ చెయ్యకపోవడం గమనార్హం. సీలింగ్ భూమిని అసైన్ చేసిన నాటికి ప్రొహిబిషన్ & అలియనేషన్ & ట్రాన్స్‌ఫర్ యాక్ట్ 1977 నిబంధనలు వర్తిస్తాయి. అలాంటి భూమిని వంశపారంపర్యంగా అనుభవించాలే తప్ప, అమ్ముకోవడానికి చట్టం ఒప్పుకోదు. అలా చేస్తే ప్రభుత్వం తిరిగి స్వాధీనపరుచుకోవచ్చు. ఈ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత అంటే 1975 నుండి 1980 వరకు కచ్చితంగా అమలు చేయడం ద్వారా కొన్ని వేల ఎకరాలను స్వాధీనపరుచుకొని, నిరుపేదలకు పంపిణీ చేయడం ద్వారా వాటి జీవితాలలో వెలుగులే కాకుండా, నిరుపేద కుటుంబాలకు ఒక ఉపాధిని కల్పించడం జరిగింది. దాని తర్వాత చట్టంలో అనేక సవరణలు తీసుకురావడం, హైకోర్టు తీర్పు వంటి వాటివల్ల చట్టం నిర్వీర్యమైనది. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ చట్టం అమలులోకి ఉన్నప్పటికీ వాటికి సంబంధించిన అనేక కేసులు, ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్ లోను, వివిధ కోర్టులలో ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. బాధాకరమైన విషయం ఏమిటంటే ఈ చట్టంపై చాలామంది రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్లకు అవగాహన లేనందువల్ల చాలావరకు కేసులన్నీ ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. అంతేగాక ప్రభుత్వాలు కూడా వాటిపై తగినంతగా దృష్టిని పెట్టకపోవడం శోచనీయం. సీలింగ్ చట్టంలోని సెక్షన్ 24 ప్రకారం ఎవరైనా సీలింగ్ డిక్లరేషన్ సమర్పించకపోవడం, లేదా భూముల విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై క్రిమినల్ కేసు ద్వారా రెండు సంవత్సరాల కారాగార శిక్ష లేదా 2000 జరిమానా లేదా రెండు విధించవచ్చు. అందుకు ముందుగా రూల్ 18 ప్రకారం జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేసి ప్రాసిక్యూట్ చేసే అధికారం కలిగి ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఒకటి, రెండు కేసులలో మాత్రం చర్యలు తీసుకున్నారు. అసలు అటువంటి అధికారం ఉన్నప్పటికీ దానిని ఉపయోగించుకున్న పాపాన పోలేదు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్, దానిలో సీలింగ్ చట్ట పరిమితికి మించి వ్యవసాయ భూముల వివరాలను, ప్రకటించిన అభ్యర్థుల వివరాలను, సంబంధిత జిల్లా కలెక్టర్లకు అలాగే ఆర్డీవోలకు పంపి, సీలింగ్ చట్టంలోని నిబంధనలు పాటించని వారిపై ప్రాసిక్యూట్ చేసి చట్టాల రీత్యా తగు చర్యలు తీసుకోవచ్చు. తద్వారా సీలింగ్ చట్ట ఉద్దేశం నెరవేరుతుంది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో కొంతమంది అభ్యర్థులు సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ సీలింగ్ చట్ట పరిమితికి మించి వ్యవసాయ భూములు కల్గి ఉన్నారని, దినపత్రికలలో ప్రచురించిన వార్తల వల్ల తెలియవస్తోంది. దానిపై జిల్లా కలెక్టర్లు తమకు సీలింగ్ చట్టం ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగించే విధంగా ప్రభుత్వం తగు ఆదేశాలు జారీ చేయాలి. నిరుపేద, భూములు లేని బలహీన వర్గాల వారికి, సీలింగ్ చట్టం ద్వారా స్వాధీన పరుచుకున్న మిగులు భూములను పంపిణీ చేయాలన్న సదుద్దేశ్యంతో స్వర్గీయ ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన సీలింగ్ చట్టం ఇప్పటికీ అమలులో ఉన్నందున వాటిపై రెవెన్యూ అధికారులకు తగు అవగాహన కల్పించి వాటిలోని నిబంధనలను తూచా తప్పకుండా పాటించే విధంగా తగు చర్యలు తీసుకోవాలి. లేకపోతే గత కాంగ్రెస్ ప్రభుత్వం 1973లో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సీలింగ్ చట్టాన్ని ప్రస్తుత ప్రభుత్వం తగు దృష్టిపెట్టి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సీలింగ్ కేసులను డిస్పోజ్ అయ్యే విధంగా అలాగే నిర్దిష్ట పరిమితికి మించి భూములు కలిగి ఉన్నవారిపై సీలింగ్ చట్ట నిబంధనలు పాటిస్తూ మిగులు భూములను ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటే అప్పుడే తన ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేసిన స్వర్గీయ పీవీ నరసింహారావు ఆత్మకు శాంతి కలుగుతుంది.

తేది : 13- 05-2024 ఆంధ్రలక్ష్మి 4 సంపుటి : 15 సంచిక : 34

# మన ఓటుకు ఏదీ నైతిక కొలమానం..?

ప్రజాస్వామ్యాన్ని ఎన్నికల స్థాయికి దిగజార్చి చాలా కాలం అయ్యింది. ఎంతలా అంటే ప్రపంచ వ్యాప్తంగా నియంతలు కూడా ఎన్నికలు అనే ముసుగు వేసుకోడానికి ఆత్రుత పడుతున్నారు. కానీ ఎన్నికలు సక్రమంగా జరిగితే ఓటు వేయడం ఏ విధంగా ప్రజాస్వామ్య ప్రక్రియో ఆలోచించాలి. ఓటు వేయడంలో ఒక ప్రత్యేకమైన వ్యవహారం ఇమిడి ఉంది. ఇందులో ప్రజలు తమకు ఉమ్మడిగా 'స్వంతమైన' దానిని ఇంకొకరి చేతికి ఉద్దేశపూర్వకంగా బదలాయించడం ఉంది. తమను తాము పరిపాలించుకొనడం అనేది ప్రజాస్వామ్యంలో ప్రజల ఉమ్మడి సంపద. ఇందులో ప్రజలందరికి భాగస్వామ్యం ఉంది. ఈ ఉమ్మడి సంపదను నిర్వహించే బాధ్యతను ప్రజలు కొద్దిమంది రాజకీయ నాయకుల చేతిలో ఓటింగ్ ద్వారా పెడతారు. ప్రజాస్వామ్యం అంటేనే ప్రజల తరఫున, వారి స్థానంలో, వారి పరోక్షంలో కొద్దిమంది పాలించేది. ప్రజల తరఫున పాలించడం అంటేనే నిరంకుశత్వానికి అవకాశం ఉందనేది స్పష్టం. అరుదుగా తప్ప ప్రజాస్వామ్యం ఎప్పుడూ ప్రజల చేత నడిపించబడేది కాదు. అంటే మరింత జాగ్రత్తగా ఓటు వేయాలని అర్థం. పుతిన్ కూడా 97శాతం ఓట్లతో ప్రజల తరఫున ఎన్నికయినట్టు ప్రకటించుకున్నాడు. ప్రజలందరికీ మంచి చేసేదే నిజమైన ప్రజాస్వామ్యం అనే మాటను తరుచు వింటుంటాం. కానీ ప్రజలు అనే పదంలో అందరూ అనే అర్థం చరిత్రలో ఎప్పుడూ లేదు. నోరున్నవారి, బలమున్న వారి ప్రయోజనాలే ప్రజల ప్రయోజనాలుగా చలామణి అవుతూ వచ్చింది. బానిసల, కింది కులాల, స్త్రీల, శ్రామికుల ప్రయోజనాలు ప్రజల ప్రయోజనాలుగా చాలా కాలం చలామణి కాలేదు. అయినా ప్రజా ప్రయోజనం అనే మాట చాలా కాలంగా చలామణిలో ఉంది. ప్రజాస్వామ్యంలో పేదల శాతం తీవ్రంగా పడిపోలేదనేది వాస్తవం. ఆ అర్థంలో ఆచరణలో ప్రజాస్వామ్యం 'ప్రజల కొరకు' పనిచేయడం లేదు. 'అందరి ప్రయోజనాలు తీర్చుతాం' అనే వాదనను నియంతృత్వ వ్యవస్థలు కూడా వాడుకుంటాయి. అది ప్రజాస్వామ్య వ్యవస్థలకు ప్రత్యేకం కాదు. కాబట్టి ప్రజాస్వామ్యం అనే మాటను నిజమైన అర్థంలో ఏ రాజకీయ పార్టీ అయినా వాడితే, అది సమాజంలో ఎటువంటి సామాజిక బలం, గొంతులేని అత్యంత అట్టడుగు వర్గాల ప్రయోజనాలకు ముందు పీట వేసిందా లేదా అనే నైతిక కొలమానాన్ని వెతకాలి. అంటే మెజారిటీ ప్రజల ప్రయోజనాలు అనేది ప్రజాస్వామ్య వ్యవస్థకు కొలమానం కాదని మనం గుర్తించాలి. సమాజంలో బడుగు వర్గాలు పాల్గొన్నంత చురుకుగా సంపన్నులు ఓటింగ్‌లో పాల్గొనరు. పేదలు డబ్బులు, వినియోగ వస్తువుల కోసం ఓట్లు వేస్తారని మధ్యతరగతి అంటుంది. మతపరమైన కారణాల రీత్యా మైనారిటీలు ఓటు వేస్తారని మెజారిటీ వాదులు అంటారు. కులం రీత్యా ఓటు వేసేవారు కూడా బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తున్నారనేది ఇంకొక ఎత్తిపొడుపు. ఈ వాదనలు అన్నీ ఏదో ఒక భావజాల ప్రభావానికి లోనై ఓటు వేసే వారికి కూడా వర్తిస్తుంది. ఇవన్నీ ఓటు వేయడానికి ఒక ప్రత్యేకమైన కారణం ఉందనే విశ్వాసం రీత్యా చేసేవే. ఏదో ఒకటి ఆశించి ఓటు వేయడం ఎప్పుడు ఒక రాజకీయ వ్యవహారమే. ఓటు వేయడం ఎలాంటి బాధ్యత, ఎవరి పట్ల బాధ్యత? ప్రతి ఓటరుకు తెలుసు తన ఓటు వేల ఓట్లలో ఒక చిన్న భాగమని, తన ఓటుకు అంతిమ ఫలితానికి మధ్య ప్రత్యక్ష సంబంధం లేదని. ఎన్నికైన ప్రతినిధులు తమ అధికారాన్ని, సంపదను పెంచుకున్నంత కాలం, 'ఓటేస్తే నాకేమొస్తది' అనే వ్యవహారం చాలా సహజం. పాలన వ్యాపారం అయిన తర్వాత, ఓటరు తన ధరను ఎందుకు అడగకూడదు? డబ్బు ఆశించే ఓటర్లు ప్రజాస్వామ్యం 'ప్రజల కొరకు' అనే వాదనలోని డొల్లతనాన్ని ఎత్తి చూపుతున్నారు. సామాజిక సంబంధాలను డబ్బుమయం చేసిన మార్కెట్టు సాధించిన విజయంగా దీన్ని చూడవచ్చు. ఎటొచ్చి, లాభాలను ఆశించే రాజకీయ నాయకుడు ఎన్నికలలో పెట్టుబడి పెట్టడానికి వెనుకాడడం లేదు. ఎన్నికైన ప్రతినిధులు లాభాలు సంపాదించుకుంటుంటే ఓటింగును వ్యాపారంగా ఎందుకు పరిగణించకూడదు? ఆ లాభాల్లో భాగాన్ని ఓటరు ఎందుకు ఆశించకూడదు? తాము చేసే సేవకు (ఓటు వేసే సేవకు) సాధ్యమైనంత లాభం పొందాలని ఒక పేద ఓటరు ఆశిస్తే, అతనిని తప్పు పట్టే నైతిక హక్కు, పన్నులు చెల్లించడం తప్ప తమకు ఏమీ ఒరగదని ఓటు వేయని మధ్య తరగతికి ఉందా? పేద ఓటరును ఆడిపోసుకునే హక్కు రాజకీయ పొలంలో మేసే ధనిక వర్గానికి అసలే లేదు. ఇదంతా ప్రజాస్వామ్యంలో భాగం కాదని మనకు తెలుసు. ప్రజాస్వామ్యాన్ని అత్యంత నిమ్న వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేసేదని నిర్వచిస్తే, ఓటు వేయడాన్ని స్వప్రయోజనం కోసం వేసేదిగా పరిగణించకూడదు. అంటే నేను ఓటు వేసేది నా కంటే ఎక్కువ సమస్యలు ఎదుర్కొంటున్న వారి తరఫునే తప్ప నా తరఫున కాదు– ఈ అర్థంలో మాత్రమే ఓటు వేయడం అనేది ఒక నైతిక, సామాజిక విధి. ఎన్నుకోబడే ప్రతినిధి ప్రజల తరఫున ధర్మకర్తగా వ్యవహరించాలి. తమ మీద ఉంచిన విశ్వాసాన్ని ధ్వంసం చేయకూడదు. ప్రజాస్వామ్యానికి ఇది ఒక శక్తివంతమైన అర్థం. ఈ విస్తృతమైన అర్థాన్ని ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఒక సాధనంగా మాత్రమే భావించే వైఖరి ధ్వంసం చేసింది. అందుకే నిజమైన అర్థంలో మన ప్రతినిధి ఎలా పనిచేసాడు అనేది కాక అతను ఏ మేరకు జవాబుదారిగా మెలిగాడు అనేది ప్రజాస్వామ్యానికి కొలమానం. కానీ ఇప్పటికే తాము ఎంతో చేసాం అనేవారైనా, రాబోయే కాలంలో ఎంతో చేస్తాం అనేవారైనా తాము ప్రజలకు జవాబుదారిగా ఇప్పటివరకు ఉన్నారా, ఆ స్వభావం వాళ్ళలో ఉందా అనే విషయం చెప్పడం లేదు. ఈ అంశం ఏ రాజకీయ పార్టీ మేనిఫెస్టోలో లేకపోవడం కొట్టొచ్చేలా కనిపించే అంశం. ప్రజాస్వామిక వ్యవస్థను ధ్వంసం చేసి పేదలకు సంక్షేమాన్ని ప్రకటిస్తున్నారనేది మధ్య తరగతికి రాజకీయాల పట్ల ఉండే ఆక్షేపణ. ప్రజాస్వామ్య వ్యవస్థలుగా చలామణి అయ్యేవి తమ సమస్యలు తీర్చుతాయి అని విశ్వసించే పేదలు ఎవరూ ఈ రోజు లేరు. ఈ వ్యవస్థలు పేదల అవసరాలు తీరే విధంగా రూపొందకపోవడం వెనక మధ్య తరగతి పాత్రా ఉంది. ప్రభుత్వ ఉద్యోగాల పట్ల కింది మధ్య తరగతికి ఉన్న తరగని ఆశ వెనక అధికారం, దాంతో వచ్చే ప్రయోజనాల పట్ల చర్చ బాహాటంగానే జరగడం చూస్తాం. కులాన్ని, మతాన్ని, డబ్బును ఎరగా వేసి ఉద్యోగాలు సంపాదించే ప్రయత్నాలు చేసేవాళ్ళు ప్రజలకు సేవ చేయడానికి చేయడం కాదు. కానీ ఈ వ్యవస్థలు ఎంతగా పేదలకు వ్యతిరేకంగా పనిచేస్తే, సమస్యల్లో ఉన్న ప్రజలు అంతగా వీటిని ధ్వసం చేసైనా తమకు న్యాయం చేస్తాననే మాయచేసే నియంతలను ఎన్నుకోడానికి సిద్ధపడతారు. బలమైన నాయకుడు అనే భావన వెనక, తమ పురోగతికి అడ్డుపడే వ్యవస్థల కన్నా బలమైన నాయకుడు అనే భావన అంతర్లీనంగా ఉంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థల ఫలాలను కింది వర్గాల దాకా రాకుండా చేస్తే జరిగే పరిణామాలు ప్రపంచ వ్యాప్తంగా నియంతలు ఎన్నిక కావడంలో చూడవచ్చు. ప్రజాస్వామ్యానికి వస్తున్న ముప్పు గురించి వగచే మధ్యతరగతి ప్రజాస్వామ్యం పరిధిని విస్తృతం చేయడం ద్వారా మాత్రమే ఎదుర్కోగలదు. తమకు పనిచేయని ప్రజాస్వామ్యాన్ని మేమెందుకు కాపాడాలి అనే శ్రామిక వర్గం ప్రశ్నకు మధ్యతరగతి దగ్గర సమాధానం లేదు. నమ్మకం అనే నైతిక విలువ లేకుండా ప్రజాస్వామ్య పునాదులు ఉండవు. వివక్షకు తావు లేకుండా, న్యాయబద్ధంగా మనకు ప్రాతినిధ్యం వహిస్తాడు అనే నమ్మకం మీద ఆధారపడి మనం ఓటు వేయగలగాలి. మనుషుల మధ్య సంబంధాలను కలిపేది గుణాత్మకమైన ఈ విశ్వాసమే. అందుకే విశ్వాస ఘాతుకమే అన్నిటికంటే హీనమైనది. ఈ విశ్వాసం ఒక ఆదర్శం మాత్రమే కాదు, ఒక ఆచరణా మార్గం కూడా. నిత్య జీవితంలో మనం ఆందోళన చెందకుండా జీవించాలంటే మన చుట్టూ ఉన్నవారు తాము చేయాల్సిన పని చేస్తారనే నమ్మకం కలగాలి. సామాజికంగా తమకన్నా దిగువన ఉన్నవారి కోసం తాము వేసే ఓటులో ఈ నైతిక కర్తవ్యాన్ని మధ్య తరగతి గుర్తెరగాలి. ఇతర వర్గాల అభివృద్ధికి హామీ పడే పార్టీకి ఓటు వేయడంలో రాజ్యాంగ విలువైన సౌభ్రాతృత్వానికి ప్రాణం పోసే పాత్రను ప్రతి ఒక్కరు పోషించవచ్చు. మొత్తం సమాజం తరపున ధర్మ కర్తృత్వం వహించవచ్చు. వర్గాలకు అతీతంగా 'భారతీయ ప్రజలమైన మేము' అనే అమాయకమైన రాజ్యాంగ భావనకు ప్రాణం పోయవచ్చు. రాజకీయ ప్రజాస్వామ్యంలో ప్రజలందరికీ సమాన అధికారం అనేది అమాయకమైన విషయమే. కానీ, అది కొద్దిగానైనా సాకారం కావాలంటే అధికారం చెలాయించే వాళ్లలో విశ్వాసం, ధర్మ కర్తృత్వం, జవాబుదారీతనం అనే విలువలు చాలా అవసరం. మనమున్నది ఆదర్శాలకు కాలం కానీ మాట నిజమే. కానీ ఓటు ద్వారా అధికార వ్యవస్థలను సృష్టించే వర్గాలు, ముఖ్యంగా మధ్య తరగతిలోనే ఈ ఆదర్శాలు కొద్దిగానైనా లేకపోతే, ఇక రాజ్య వ్యవస్థలో వాటిని ఆశించలేం.

# తేలిన ఏపీ పోస్టల్ బ్యాలెట్స్ లెక్క - రికార్డే ...!

ఎన్నికల విధులలో పాల్గొంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ను పెద్ద ఎత్తున ఉపయోగించుకున్నారు. ఎన్నికల విధులో ఉన్న ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ల లో 25 పార్లమెంటరీ నియోజకవర్గాలకు 4,44,216 మరియు 175 అసెంబ్లీ నియోజక వర్గాలకు 4,44,218 పోస్టల్ బ్యాలెట్ పోలైనట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రంలో అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో ఈ నెల 5 న ప్రారంభమై 9న ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో పెద్ద ఎత్తున ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ముగింపు రోజైన 9 వ తేదీన న పార్లమెంటు నియోజకవర్గాలకు 11,374 ఓట్లు, అసెంబ్లీ నియోజక వర్గాలకు 11,370 ఓట్లు పోలయ్యాయని తెలిపారు.



పార్లమెంటరీ నియోజక వర్గాల వారీగా అత్యధిక మొత్తంలో 22,650 పోస్టల్ బ్యాలెట్ నెల్లూరు నియోజక వర్గంలో పోల్ అవ్వగా, అత్యల్పంగా 14,526 ఓట్లు అమలాపురం (ఎస్సీ) నియోజక వర్గంలో పోల్ అయ్యాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వినియోగించుకున్న ఇద్దరు ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయలేదు. ఏపీలో మొత్తం దాదాపు 13 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో దాదాపు 5 లక్షల మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. ఇందులో 4 లక్షల 30 వేల మంది పోస్టల్ బ్యాలెట్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో లక్షా 5 వేల మంది టీచర్లే ఉన్నారు.. 40 వేల మంది పోలీసులు ఉన్నారు. 2019 ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకున్న వారు 2 లక్షల 38 వేల మంది మాత్రమే.. కానీ ఈ నంబర్ ఇప్పుడు డబుల్ అయ్యింది. ప్రభుత్వంపై ఉద్యోగులకు పాజిటివ్ ఇమేజ్ ఉంటే ఓటు వేయడానికి ఆసక్తి చూపించరు కానీ వ్యతిరేకత ఉంటేనే ఓటు రూపంలో చూపిస్తారన్న చర్చ జరుగుతుంది. గతంలో లేనట్టుగా ఈసారి తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎక్కువగా ఆసక్తి చూపించారు. ఓటింగ్ తమకు అనుకూలమంటే.. తమకని అటు కూటమి, ఇటు వైసీపీ నేతుల చెప్పుకుంటున్నారు. పార్టీల నేతలు వీరిని కూడా ప్రలోభాలకు గురి చేయాలనుకున్నారు. కొన్ని చోట్ల 5 వేలు.. మరికొన్ని చోట్ల 3 వేలు అంటూ బేరసారాలు నడిచాయి. కొందరికి ఎన్వలప్స్ మరికొందరికి యూపీఐ ద్వారా పేమెంట్స్ అందినట్టు ఆరోపణలు వినిపించాయి. అయితే ఈసీ దీనిపై ఫోకస్ చేసింది.. కొందరు ఉద్యోగులపై చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించింది. దాంతో ప్రలోభాలు చాలా వరకు తగ్గిపోయినట్లుగా భావిస్తున్నారు.

తేది : 13- 05-2024 | ఆంధ్రలక్ష్మి | 5 | సంపుటి : 15 సంచిక : 34

# ఓటర్ మిత్రమా.. జాగ్రత్త! ఆ సౌండ్ వస్తేనే మీరు ఓటేసినట్టు..!

* ఓటు వేయడం చాలా సులభం
* కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం
* మీ ఓటర్ స్లిప్పు భద్రపరుచుకోండి
* మీ వెంట గుర్తింపు కార్డు తీసుకెళ్లండి
* పోలింగ్ బూత్‌లో ప్రశాంతంగా ఓటేయండి
* ఓటు వేశారా లేదా.. జాగ్రత్తగా పరిశీలించండి
* ఈవీఎం గురించి తెలుసుకోండి.. ఎవరి మాటలు వినొద్దు..
* ఓటు వేసిన తర్వాత బీప్ సౌండ్ వస్తేనే మీరు ఓటేసినట్టు
* మీరు వేసిన ఓటు సరిగా పడిందా లేదా వీవీ పాట్‌లో చెక్ చేసుకోవచ్చు




నేడే... అనగా మే 13, 2024.. సోమవారం. రెండు రాష్ట్రాల్లో ఓట్ల పండుగ. ప్రతీ ఓటరు ఓటేయడానికి ఆసక్తిగా ఎదురుచూస్తోన్న సందర్భం. ఈ నేపథ్యంలో ఓటుకు ముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఓటు వేయడానికి అమల్లో ఉన్న పద్ధతులేంటీ? అన్న విషయాలు తెలుసుకుందాం. మీరు ముందుగా చెక్ చేసుకోవాల్సిన విషయం మీ పేరు ఓటరు జాబితాలో ఉందా? ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో మీ పేరు లేదా ఎపిక్ నెంబర్ లేదా అడ్రస్‌తో చెక్ చేసుకోవచ్చు. https:electoralsearch.eci.gov.in వెబ్‌సైట్‌లో మీరు సులభంగా చెక్ చేసుకోవచ్చు ఓటరు గుర్తింపు కార్డు(ఎపిక్) ఉండడం మంచిది. మీ పేరు జాబితాలో ఉంటే మీ ఎపిక్‌ను మీరు సులభంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. https:voterportal.eci.gov.in/login వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ వివరాలు నమోదు చేయగానే డౌన్‌లోడ్ అప్షన్ వస్తుంది. అయితే మీ మొబైల్ నెంబర్ అనుసంధానం కాకపోతే మాత్రం మీరు డౌన్‌లోడ్ చేసుకోలేరు. ఇక కొందరి ఓటరు కార్డుల్లో స్వల్ప తేడాలు (అడ్రస్ మార్పు, ఫోటో పాతది ఉండడం లేదా పేరు అక్షరాల్లో మార్పులు) ఉండొచ్చు. దానికి ఎలాంటి కంగారు లేదు. ఎపిక్ వివరాల్లో స్వల్ప తేడాలున్నా, ఓటరు గుర్తింపు నిర్ధారణ అయితే ఓటు హక్కు కల్పిస్తారు. ఓటరు గుర్తింపు కార్డులో ఫోటోలు తారుమారు కావడం, ఇతర లోపాలతో ఓటరు గుర్తింపు ధ్రువీకరణ సాధ్యం కానప్పుడు, కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన జాబితాలోని ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకదానిని ఆధారంగా చూపాల్సి ఉంటుంది. ప్రవాస భారత ఓటర్లు తమ పాస్‌పోర్టును తప్పనిసరిగా చూపాల్సి ఉంటుందని తెలిపింది.

ఆధార్‌కార్డు, ఉపాధి హామీ కార్డు, జాబ్ కార్డు , బ్యాంకు/తపాలా కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్, కేంద్ర కార్మికశాఖ పథకం కింద జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్, ఇండియా (ఆర్జీఐ).. నేషనల్ పాపులేషన్ రిజిస్ట్రార్ (ఎన్పీఆర్) కింద జారీ చేసిన స్మార్ట్ కార్డు , భారతీయ పాస్‌పోర్టు, ఫొటో గల పెన్షన్ పత్రాలు కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/పీఎస్‌యూలు/ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగి గుర్తింపు కార్డులు, ఎంపీలు/ఎమ్మెల్యేలు/ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజెబిలిటీ గుర్తింపు కార్డు(యూడీఐడీ) మొదలైనవి. పోలింగ్‌కు కొన్ని రోజుల ముందే పోలింగ్ కేంద్రం పేరు, తేదీ, సమయం, ఇతర వివరాలతో ఓటర్లకు పోలింగ్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులను జారీ చేస్తారు. అయితే, వీటిని ఓటరు గుర్తింపుగా పరిగణించరు. కానీ ఇందులో.. పార్ట్ నెంబర్, ఓటరు సీరియల్ నెంబరు ఉంటాయి. ఈ వివరాలతో ఓటరు జాబితాలో మిమ్మల్ని సులభంగా గుర్తిస్తారు. ప్రభుత్వ గుర్తింపు కార్డు ఏదున్నా.. మీకు ఓటు హక్కు కల్పిస్తారు. కాబట్టి పోలింగ్ స్లిప్పు ఉంటే మీ పని చాలా సులభం. పోలింగ్ బూత్‌లోకి వెళ్లగానే మీ దగ్గరున్న పోలింగ్ స్లిప్పును చూపించండి. లేదా మీ ఓటరు సీరియల్ నెంబర్, పార్టు నెంబరు చెప్పండి. ఈ వివరాలను బట్టి ఒక్క నిమిషంలో ఓటర్ వివరాలను ధృవీకరిస్తారు, వివరాలన్నీ సరిగ్గా ఉన్నాయని నిర్ధారణ అయిన తరువాత మరో పోలింగ్ అధికారి మీ ఎడమ చూపుడు వేలిపై సిరా గుర్తు వేస్తారు. మీ వివరాలను (ఓటరు ఐడీ నెంబరు) ఫారం 17Aలో నమోదు చేస్తారు. ఓటరు జాబితాలో బొటనవేలి ముద్ర లేదా సంతకం చేయించుకుంటారు. ఎలక్టోరల్ రోల్ కాపీలో గుర్తు పెట్టి మీరు ఓటు వేయడానికి ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌కు వెళ్లడానికి అనుమతిస్తారు. ఓటింగ్ కోసం ఏర్పాటు చేసిన చిన్న గదిలో ఓటేసే EVM మెషీన్, దాని పక్కనే VVPAT యంత్రమూ ఉంటుంది. (మీరు ఎవరికి ఓటేశారో కాగితంపై ముద్రించి చూపించే యంత్రమే ఈ VVPAT) ఈవీఎంపై అభ్యర్థుల పేర్లు ఒక పక్క.... వారికి కేటాయించిన గుర్తులు మరో వైపు... వీటి పక్కన్నే నీలి రంగు బటన్ ఉంటాయి. మీకు నచ్చిన అభ్యర్థికి కేటాయించిన గుర్తు పక్కన్నే ఉన్న నీలి రంగు బటన్‌ను నొక్కితే మీ ఓటు నమోదైనట్లు లెక్క. బటన్ నొక్కిన తరువాత అయిదు సెకన్ల పాటు చిన్న శబ్ధం వినిపిస్తుంది. ఆ వెంటనే VVPAT మెషీన్‌పై పచ్చటి లైట్ వెలుగుతుంది. VVPATపై ఉండే స్క్రీన్‌పై చూస్తే... మీరు ఓటేసిన అభ్యర్థి తాలూకూ గుర్తు, ఈవీఎంపై అతడికి కేటాయించిన క్రమసంఖ్య, పేరు ముద్రించిన కాగితపు స్లిప్ ఏడు సెకన్లపాటు కనిపిస్తుంది. ఏడు సెకన్ల తరువాత ఈ స్లిప్ కాస్తా బాక్స్‌లోకి పడిపోతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు రెండూ జరుగుతున్నాయి కాబట్టి.. పోలింగ్ బూత్‌లో రెండు ఈవీఎంలు, రెండు వీవీ పాట్‌లు ఉంటాయి. ఒక ఓటు మాత్రమే వేసి రెండో ఓటు మరిచిపోవద్దు. ఓపిగ్గా.. రెండు ఓట్లు వేసి ప్రజాస్వామ్యంలో ఓటరుగా మీ బాధ్యతను నిర్వర్తించుకోవాలి.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు

**- ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్**




'పోలింగ్ సందర్భంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాం. జిల్లాతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాం. నేరచరితులను గుర్తించి ఇప్పటికే బైండోవర్ చేశాం. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించడంతోపాటు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రజలందరూ వినియోగించుకోవాలి' అని ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ కోరారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 1,446 ప్రాంతాల్లో 2,470 పోలింగ్ కేంద్రాలున్నాయి. అందులో 213 ప్రాంతాల్లో 450 సమస్యాత్మక కేంద్రాలున్నాయి. వీటిపై ప్రత్యేక దృష్టిసారించామని, జిల్లా పోలీసులతో పాటు కేంద్రబలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామన్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లోని ప్రజలతో మమేకమై ఎన్నికల నియమావళిని వివరించడంతోపాటు ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల వేళ అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీచేశారు. కేంద్ర బలగాలతో భద్రతను కట్టుదిట్టం చేసి వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లను సైతం చేశారు. ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టాం. రౌడీషీటర్లతోపాటు ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లోని నిందితుల బైండోవర్ల ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 107, 109, 110 సీఆర్‌పీసీ కింద 10,485 మందిని బైండోవర్ చేశాం. ఎన్నికలు ముగిసేంత వరకు వీరిపై ప్రత్యేక నిఘా ఉంటుంది. ఎన్నికల వేళ అల్లర్లు సృష్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లాలో 533 లైసెన్స్‌డ్ ఆయుధాలుండగా 530 ఆయుధాలను డిపాజిట్ చేశామన్నారు. ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని, జిల్లా పోలీసులతోపాటు విశ్రాంత పోలీసు, ఆర్మీ అధికారులు, ఎన్‌సీసీ అధికారులతోపాటుగా నాలుగు ప్లటూన్ల బీఎస్‌ఎఫ్ బలగాలు, నాలుగు కంపెనీల తమిళనాడు స్టేట్ ఆర్మ్‌డ్ ఫోర్స్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సివిల్ పోలీసులు మొత్తంగా నాలుగువేల పైచిలుకు మందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ స్టేషన్ పరిసరాల్లో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, నియమావళి ఉల్లంఘనపై 67 కేసులు నమోదుచేశామని. సోషల్ మీడియా పోస్టులపై నిఘా ఉంచామన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిగా నియమించామని. నెల్లూరు సిటీ నియోజకవర్గానికి నగర డీఎస్పీ, రూరల్ నియోజకవర్గానికి ట్రాఫిక్ డీఎస్పీ, కోవూరుకు దిశ డీఎస్పీ, సర్వేపల్లికి నెల్లూరు రూరల్ డీఎస్పీ, కావలికి కావలి డీఎస్పీ, కందుకూరుకు డీఎస్పీ, వెంకటగిరి పరిధిలోని మండలాలకు ఏఆర్ డీఎస్పీ, ఉదయగిరికి ఇన్‌చార్జి సీసీఎస్ డీఎస్పీని ప్రత్యేకాధికారిగా నియమించాము. వీరు ఎన్నికలు పూర్తయ్యే వరకూ ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్నారు. ఓటు వజ్రాయుధం. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలన్నారు. ఎన్నికలవేళ మద్యం, ధన ప్రవాహం, ప్రలోభాలకు గురిచేసే వస్తువులను కట్టడి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, జిల్లా వ్యాప్తంగా 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. 26 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 26 ఎస్‌ఎస్, 46 ఎంసీసీ, 105 క్విక్ రెస్పాన్స్ టీంలు ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నాం. లాడ్జీలు, ప్రైవేటు గెస్ట్‌హౌస్‌ల్లో సైతం తనిఖీలు జరుగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి తగిన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 2,72,31,845ల నగదును సీజ్ చేసి ఆదాయపు పన్నుశాఖ అధికారులకు అప్పగించామని, రూ. 2,72,054 విలువచేసే వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. మూడు కేసుల గంజాయిని పట్టుకున్నామన్నారు. 663 కేసుల్లో రూ. 30,56,981 విలువ చేసే 3,990.04 లీటర్ల (19,366 బాటిళ్లు), పది కేసుల్లో రూ. 78,435 విలువచేసే పొరుగు రాష్ట్రాలకు చెందిన 205.8 లీటర్లు (1,009 బాటిళ్లు) మద్యంను స్వాధీనం చేసుకని నిందితులపై కేసులు నమోదు చేశాం. నాటుసారాపై దాడులు చేసి 37.5 లీటర్లను స్వాధీనం చేసుకుని 28,700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. తనిఖీలు కొనసాగుతున్నాయి. ఎన్నికల ప్రలోభాలపై సీ విజిల్ యాప్, 1950 హెల్ప్ లైన్, డయల్ 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని నేడు జరగనున్న పోలింగ్ సందర్భంగా తెలిపారు.

# దేశ గతిని మార్చేది... మార్పునకు నాంది పలికేది.. ఓటే..!

దేశ గతిని మార్చేది, వ్యవస్థలో మార్పునకు నాంది పలికేది.. ఓటే. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థను, బహుళ పార్టీలు కలిగిన భారతదేశంలో ప్రతి 5 సంవత్సరాలకొకసారి ప్రతిష్టాత్మకంగా ఎన్నికల నిర్వహణను కుంభ మేళాగా ప్రకటిస్తారు. చైతన్య శీలురైన ఓటర్లే ప్రజాస్వామ్యానికి దీప స్తంభాలు. దేశ భవిత, పౌరుల సంక్షేమానికి పాడుపడే శక్తి యుక్తులు, విచక్షణ కలిగిన నేతలు చట్టసభల్లో కొలువు తీరితేనే మన ఎన్నికల ప్రక్రియకు సార్ధకత లభిస్తుంది. ఓటర్లు నిస్తేజం వీడి విజ్ఞతతో నిజాయితీపరులైన నేతలకు పట్టం కడితేనే భారత్‌లో వెలుగు రేఖలు సాధ్యమవుతాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనది. భారత దేశంలో నివాసముంటూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించింది. ప్రపంచంలోనే 144 కోట్ల జనాభా కలిగిన అతిపెద్ద దేశంలో ప్రస్తుతం 18వ లోకసభకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 97 కోట్ల మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని దేశ ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఐదేళ్లకోసారి దేశ పార్లమెంటుకు ఎన్నికలు జరుపుకొని ప్రజలచేత ప్రజాప్రతినిధులను ఎన్నుకొని మెరుగైన ప్రజా పాలనకు బాటలు వేస్తూ పౌరుల బంగారు భవితను ఓటే నిర్దేశిస్తుంది. ఇంతటి విలువైన ఓటు హక్కుకు పేరు నమోదు చేసుకోవడం, వినియోగించుకోవడంలో భారత పౌరులు ముఖ్యంగా యువత అంతులేని అలసత్వాన్ని ప్రదర్శించుచుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. భావి భారత నిర్మాణంలో యువ ఓటర్లది నిర్ణయాత్మక పాత్ర అన్నది కాదనలేని సత్యం. అయితే, శక్తివంతమైన ఓటు హక్కును నమోదు చేసుకోవడంలో 18 ఏండ్ల నిండిన



నవతరం నిర్లక్ష్యం వహించడం దేశానికి ఎంత మాత్రం క్షేమం కాదు. ఈ ఎన్నికల్లో 18-19 సంవత్సరాల వయస్సు ఉన్న కొత్తగా ఓటు హక్కు పొందిన వారి సంఖ్య 1.9 కోట్లకు చేరుకుంది. అయితే 18 ఏండ్లు నిండి కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి అర్హులుగా ఉన్నవారు 4.9 కోట్లు ఉన్నారు. ఈసీ లెక్కలను విశ్లేషిస్తే 38 శాతం యువత ఓటరు నమోదులో శ్రద్ధ చూపడం మిగతా 62 శాతం దూరంగా ఉన్నారని తెలుస్తుంది. దేశ ప్రగతి వాహనానికి ఇరుసు లాంటి వారు యువతే. పోలింగు రోజు వీరు ఓటు హక్కును విధిగా ఉపయోగించుకుంటేనే భారతదేశ రూపు రేఖలు మారుతాయి. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశమున్న ఇండియాలో యువత దాని పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించటం సరికాదు. 100 శాతం ఓటు హక్కు వినియోగించుకోవాలి. కేంద్ర ఎన్నికల సంఘం కొద్ది రోజుల క్రితం వెల్లడించిన వివరాల ప్రకారం దేశంలో ఓటు హక్కు నమోదు పరంగా కొన్ని రాష్ట్రాల్లో యువత మరింతగా నిర్లక్ష్యం వహించింది. బీహార్‌లో 18-19 ఏళ్ల వయసు వారిలో కేవలం 17 శాతం యువతే కొత్తగా ఓటు హక్కును నమోదు చేసుకుంది. ఆ రాష్ట్రంలో 18-19 సంవత్సరాల వయసు వారు 54 లక్షల మంది ఉన్నారు. వారిలో 9.3 లక్షల మంది ఓటు హక్కు పొందారు. దేశ రాజధాని ఢిల్లీలో 18-19 ఏండ్ల వయసు ఓటర్లు 7.20 లక్షల మంది ఉన్నారు. వారిలో 1.50 లక్షల మంది (21 శాతం) ఓటు హక్కు పేరు నమోదు చేసుకున్నారు. ఉత్తర ప్రదేశ్ 23%, మహారాష్ట్ర 27%లో అతి తక్కువ ఓటు నమోదు జరిగిందంటే యువతరం ప్రజాస్వామ్య పరిరక్షణ యజ్ఞం పట్ల ఉదాసీనంగా ఉండిపోయారంటే, లోపం ఎక్కడ ఉందో ఆలోచించాలి. తెలంగాణలో 18 సంవత్సరాలు నిండిన వారు 12 లక్షల మంది ఉన్నారు. వారిలో 8 లక్షల మంది ఓటు హక్కుకు నమోదు జరిగింది. ఇలా 67% ఓటు హక్కు నమోదుతో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచింది. జమ్మూ కాశ్మీర్ 62 శాతం, హిమాచల్ ప్రదేశ్ 60 శాతం, తర్వాతి స్థానంలో ఉన్నాయి. కేవలం 12 రాష్ట్రాల్లోనే 18 -19 ఏళ్ల యువత ఓటు హక్కు నమోదు 50 శాతం కంటే ఎక్కువగా ఉంది. నగరవాసులంటే కాస్త చైతన్యవంతులు.. ఓటు హక్కు వినియోగంలో మాత్రం హైదరాబాద్ ప్రజలు చాలా వెనుకబడి ఉన్నారు. ఏ ఎన్నిక చూసినా మిగతా రాష్ట్రమంతా ఒక తీరు, రాజధాని ఒక తీరు అన్నట్లుగా ఉంటోంది. పోలింగ్ శాతం పెంపునకు లెట్స్, ఓట్ లాంటి స్వచ్ఛంద సంస్థలు, వాకథాన్‌లు, రన్‌లతో అవగాహన కార్యక్రమాలు చేపట్టినా, కార్పొరేట్ కంపెనీలు ఆఫర్లు అందించినా ప్రజలు, ఉద్యోగులు మాత్రం పట్టనట్లే వ్యవహరిస్తున్నారు. రాజధాని చుట్టుపక్కల 24 అసెంబ్లీ స్థానాలు ఉంటే కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే 50 శాతం ఓటింగ్ దాటుతోంది. సరాసరి మాత్రం 40 శాతం మించడం లేదు. గ్రేటర్ హైదరాబాద్‌లో దాదాపు 10 లక్షల మంది ఐటీ నిపుణులు ఉన్నారు. వీరిలో సగం మంది కూడా ఓటు హక్కును వినియోగించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కాగా ఈసారి పోలింగ్ మే 13న సోమవారం రావడం, ఈ సారి ఎన్నికలు నడి వేసవిలో రావడం, ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు చేరుకోవడంతో పోల్ మరీ తగ్గే ప్రమాదం ఉన్నది. ఈసారి 85 సంవత్సరాల వృద్ధులకు, 40 శాతం అంగవైకల్యం కలిగిన వికలాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది. మే 13న జరిగే ఎన్నికల్లో 100 శాతం ఓటింగ్ నమోదు చేద్దాం! రాజ్యాంగ కల్పించిన ఓటు హక్కును వినియోగించుకుందాం.. ఓటుకు నోటుకు దూరంగా ఉందాం.. మంచి ప్రజా ప్రతినిధులను ఎన్నుకుందాం. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం!

# జంపింగ్ జపాంగ్‌లు.. గెలుపు గుర్రం ఎక్కేనా...?

సార్వత్రిక ఎన్నికలకు ముందు ఏపీలో అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు పార్టీలు, కండువాలు మార్చేసిన జంపింగ్ జపాంగ్‌ల గురించి ఆసక్తికర చర్చ జరుగుతోంది. నిన్న మొన్నటి వరకు ఉన్న పార్టీలను, రాజకీయంగా ప్రాధాన్యం ఇచ్చిన అధినేతలను కూడా టికెట్ల కోసం వదిలేసిన నాయకులు ఇతర పార్టీల్లో చేరి టికెట్లు దక్కించుకున్నారు. వీరు గెలుస్తారా? ఓడుతారా? అనేది చర్చకు వస్తోంది. తిరుపతి నుంచి జనసేన అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆరణి శ్రీనివాసులు ఎన్నికలకు కొద్ది వారాల ముందు వైసీపీ నుంచి బయటకు వచ్చి జనసేనలో చేరారు. వెంటనే ఆయనకు తిరుపతి టికెట్ ఇచ్చారు. అన్నట్లు ఆరణి వైసీపీ నుంచి గత ఎన్నికల్లో చిత్తూరు స్థానంలో విజయం దక్కించుకున్న సిట్టింగ్ ఎమ్మెల్యే కావడం గమనార్హం. 2019లో వైసీపీ తరపున మచిలీపట్నం ఎంపీగా గెలిచిన వల్లభనేని బాలశౌరి ఎన్నికలకు ముందు జనసేనలో చేరారు. ఈ పార్టీ తరపున మరోసారి మచిలీపట్నం నుంచే పోటీ చేస్తున్నారు. భీమవరం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పులపర్తి రామాంజనేయులు ఎన్నికల షెడ్యూల్ వచ్చే వరకు టీడీపీలో ఉన్నారు. పొత్తులో భాగంగా ఈ సీటును జనసేనకు కేటాయించడంతో ఆయన టీడీపీ నుంచి జంప్ చేసి జనసేన తీర్థంపుచ్చుకున్నారు. అదే చేత్తో టికెట్ అందుకుని బరిలో నిలిచారు. అనకాపల్లి అసెంబ్లీ స్థానం నుంచి జనసేన తరపున పోటీలో ఉన్న సీనియర్ నేత కొణతాల రామకృష్ణ చాన్నాళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఎన్నికలకు కొద్ది మాసాల ముందు ఆయన జనసేన తీర్థం పుచ్చుకుని టికెట్ దక్కించుకున్నారు. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం నుంచి వంశీ కృష్ణయాదవ్ జనసేన తరపున పోటీ చేస్తున్నారు. కానీ, ఈయన కూడా ఎన్నికలకు కొన్ని మాసాల ముందు వైసీపీ నుంచి బయటకు వచ్చి జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఆ తర్వాత ఆ పార్టీ టికెట్ పై బరిలో నిలిచారు. విజయవాడ ఎంపీగా ఉన్న టీడీపీ నేత కేశినేని నాని ఆ పార్టీతో విభేదించి వైసీపీలో చేరారు. ఆ వెంటనే ఆయనకు ఇక్కడ నుంచే వైసీపీ ఎంపీ టికెట్ ఇవ్వడం విశేషం. చిత్రం ఏంటంటే కండువా కప్పుకోక ముందే ఆయనకు టికెట్ ప్రకటించారు. హిందూపురం లోక్‌సభ స్థానం వైసీపీ అభ్యర్థిగా జోలదరాశి శాంతకు కూడా వైసీపీ అనూహ్యంగా టికెట్ ప్రకటించింది. ఆమె పార్టీ కండువా కప్పుకోక ముందే టికెట్ ప్రకటించడం గమనార్హం. రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేని డాక్టర్ సంహాద్రి చంద్రశేఖర్‌ను వైసీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. ఆయనను పార్టీలో చేర్చుకుని అనంతరం.. టికెట్ ఇచ్చింది. గన్నవరం నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో విజయం దక్కించుకున్న టీడీపీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పార్టీలో చేర్చుకుని వైసీపీ టికెట్ ఇచ్చింది. అయితే.. ఆయన గత నాలుగున్నరేళ్లుగా వైసీపీకి మద్దతు తెలుపుతున్న విషయం తెలిసిందే. విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ కూడా గత ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచారు. ఆయన కూడా నాలుగేళ్లకు పైగా వైసీపీకి మద్దతుగా రాజకీయాలు చేశారు. తాజా ఎన్నికల్లో వైసీపీ ఆయనకు టికెట్ ఇచ్చింది. టీడీపీ నేత గొల్లపల్లి సూర్యారావుకు తాజా ఎన్నికల్లో ఆ పార్టీ టికెట్ నిరాకరించడంతో వైసీపీలో చేరి ఆ వెంటనే రాజోలు(ఎస్సీ) టికెట్ దక్కించుకున్నారు. తిరువూరులో టీడీపీ నేతగా ఉన్న నల్లగట్ల స్వామిదాసును ఎన్నికలకు కొన్ని వారాల ముందు పార్టీలో చేర్చుకున్న వైసీపీ ఆవెంటనే ఆయనకు టికెట్ ప్రకటించింది. ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే రక్షణనిధిని పక్కన పెట్టేసింది. ఎన్నికలకు ముందు వరకు వైసీపీలో ఉన్న వాసంశెట్టి సుభాశ్‌కు ఆ పార్టీ టికెట్ నిరాకరించడంతో టీడీపీ బాట పట్టారు. ఆ వెంటనే ఆయన టీడీపీ నుంచి రామచంద్రపురం టికెట్ దక్కించుకున్నారు. పెనమలూరు ఎమ్మెల్యేగా ఉన్న వైసీపీ నేత కొలుసు పార్థసారథికి ఆ పార్టీ టికెట్ నిరాకరించడంతో టీడీపీలో చేరారు. ఆయన పార్టీలో చేరకముందే.. టీడీపీ నూజివీడు టికెట్ ప్రకటించింది. గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ నేతగా ఉన్న యార్లగడ్డ వెంకట్రావుకు ఆ పార్టీ టికెట్ నిరాకరించడంతో ఆయన కూడా టీడీపీలో చేరి టికెట్ దక్కించుకున్నారు. కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న వైసీపీ నేత గుమ్మనూరు జయరాంకు ఆ పార్టీ కర్నూలు ఎంపీ టికెట్ ఆఫర్ చేసింది. దీనికి నిరాకరించిన జయరాం టీడీపీలో చేరి గుంతకల్ అసెంబ్లీ టికెట్ దక్కించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆ పార్టీ టికెట్ నిరాకరించింది. దీంతో ఈయన కూడా టీడీపీలో చేరి అదే టికెట్ సొంతం చేసుకున్నారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పార్టీతో విభేదించి బయటకు వచ్చారు. ఈ క్రమంలో ఈయన టీడీపీలో చేరి ఆత్మకూరు నియోజకవర్గం టికెట్ దక్కించుకున్నారు. గత 2019 ఎన్నికలకు ముందు వరకు టీడీపీలో ఉన్న ఈయన అప్పట్లో వైసీపీలో చేరి టికెట్ దక్కించుకోగా.. ఇప్పుడు వైసీపీ నుంచి మళ్లీ టీడీపీ బాట పట్టారు. ఎన్నికలకు ముందు వరకు వైసీపీలో ఉన్న వేమిరెడ్డి ప్రశాంతి, వేమిరెడ్డి ప్రభాకర్‌లు(దంపతులు) ప్రత్యక్ష ఎన్నికల్లో టికెట్లు దక్కకపోయే సరికి, టీడీపీలో చేరి పోయారు. ఈ క్రమంలో కోవూరు అసెంబ్లీ టికెట్‌ను వేమిరెడ్డి ప్రశాంతి, నెల్లూరు ఎంపీ టికెట్‌ను ప్రభాకర్ రెడ్డి దక్కించుకున్నారు. నెల్లూరు రూరల్ వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆ పార్టీతో విభేదించి టీడీపీకి జై కొట్టారు. ఈ క్రమంలో ఆయన కూడా దేశం తరపున నెల్లూరు రూరల్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా సత్యవేడు వైసీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు ఆ పార్టీ ఈ దఫా ఎంపీ టికెట్ ఆఫర్ చేసింది. అయితే, ఆయన ఈ ఆఫర్‌ను తిరస్కరించి.. టీడీపీలో చేరారు. అనంతరం ఆయన సత్యవేడు అసెంబ్లీ టికెట్ దక్కించుకుని పోటీలో నిలిచారు.

## ఓటరు పండుగ..!



"అన్నా.. మీ ఓటరు స్లిప్పులు చూపించండన్నా" అని అడిగారు. "ఎందుకు" అన్నాను. "స్లిప్పుకు రెండు వేలిస్తున్నామన్నా" అన్నారు. వచ్చిన వారిలో నాకు తెలిసిన కుర్రాళ్ళున్నారు. "ఎప్పుడైనా నేను డబ్బులు తీసుకున్నానా" అడిగాను. "లేదన్నా. తీసుకోలేదు" అన్నారు. నమస్కారం పెట్టి వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిపోయిన కాసేపటికి హడావిడిగా మా పనిమనిషి వచ్చి "ఈపూట పనికి రాలేనమ్మా. వెంటనే వెళ్ళిపోవాలి" అంది. "ఏమి ఎందుకు రావు" అంది మా చెల్లెలు. "సాయంత్రం...పార్టీ వాళ్ళ మీటింగుందమ్మా. మనిషికి అయిదొందలు ఇస్తున్నారంటా" అంది. "సరే" అంది మా చెల్లెలు. సహజంగా మా పనమ్మాయి పలకరిస్తే తప్ప మాట్లాడదు. మర్నాడు పొద్దున్నే పనికి వచ్చిన ఆమె మొహం వెలిగిపోతోంది. నవ్వుతూ పని చేసేస్తోంది. "సభకు వెళ్ళావా డబ్బులు ఇచ్చారా" అడిగింది మా చెల్లెలు. "వెళ్ళానమ్మా..నాకు అయి దొందలు ఇచ్చినారు. నా కూతురు పెరుక్కు నేసింది" అంది. మా చెల్లెలు కూడా సంతోష పడిపోయింది. "అంతే కాదమ్మా,, రాత్రి మా ఇంటికొచ్చి ...పార్టీ వాళ్ళొక రెండు వేలు, ...పార్టీ వాళ్ళొక రెండు వేలు ఇచ్చేసి పోయినారు" అంది ఆనందపడిపోతూ.. "మా ఇంటాయనకు నాలుగు వేలు, నాకు నాలుగు వేలు వచ్చినాయమ్మా" అంది మళ్ళీ తనే. ఇలా "రెండు పార్టీల దగ్గరా డబ్బులు తీసుకుంటే ఇద్దరికీ ఓట్లు ఎట్లా వేస్తావు" ప్రశ్నించింది మా చెల్లెలు అమాయకంగా. ఫిలాసఫర్లా ఒక నవ్వు నవ్వేసింది మా పనిమనిషి. "ఎవరికి ఓటేశావు పెద్దాయన" ఓ వ్యక్తిని అడిగాడు పోల్ సర్వే నిర్వహిస్తున్న విలేకరి. 'ఒకాయన మా ఊరికి రోడ్డు వేయిస్తానన్నాడు. మరొకాయన మా ఊరికి బస్సు వేయిస్తానన్నాడు రోడ్డు ఉంటే కదా బస్సు వచ్చేది. అందుకుని రోడ్డువేయిస్తాను అని చెప్పినాయనకు ముందు ఓటు గుద్దేసినా. ఒట్టి రోడ్డు ఉంటే ఏం లాభం బస్సు ఉంటే కదా రోడ్డు ఉపయోగం. అందుకుని బస్సు వేయిస్తానన్న మరొకాయనకు కూడా ఓటు గుద్దేసినా' అన్నాడు. రహస్య ఓటింగ్ కదా. ఓటు ఎవరికి వేసేది తెలియదు మరి! ఈకోణంలో... భారత ప్రజాస్వామ్యం వెలిగిపోతంది. అత్యున్నతమైన విద్యావంతులు... మేధావులు అనుసరించాల్సిన ప్రజాస్వామ్య వ్యవస్థ నిరక్షరాస్యులు, అవకాశవాదులమధ్య అవహేళనపాలౌతూ సుదీర్ఘ కాలం భారతదేశాన్ని పట్టిపీడిస్తున్న ఈ జాడ్యం ముందుతరాలు ఏ స్థాయిలో ఎదుర్కోబోతున్నాయో అనేది ప్రశ్నర్థకం. అయితే గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో యువతరం తమ హక్కులను వినియోగించుకోవడంలో ఉత్సాహం చూపింది కనుక ప్రభుత్వంలో మార్పు వచ్చి చట్టాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునే పరిస్థితుల్లో ఈ దేశ యువతరం తయారవుతోందని గంపెడు ఆశతో దేశం ఎదురచూస్తోంది.!

# తొలిసారి ప్రజాతీర్పు కోరుతున్న ప్రముఖులు



ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కొందరు నాయకులు తొలిసారి ప్రత్యక్ష ఎన్నికలను ఎదుర్కోబోతున్నారు. పరోక్ష ఎన్నికల ద్వారా చట్టసభలకు ఎన్నికై రాజకీయాలలో కీలకంగా వ్యవహరిస్తున్నప్పటికీ ప్రత్యక్ష ఎన్నికలలో ఎన్నడూ పోటీ చేయని నాయకులు కొందరు తొలిసారి ప్రజాతీర్పు కోరుతున్నారు. అలాగే, కుటుంబ సభ్యుల కోసం రాజకీయంగా క్రియాశీలంగా పని చేసినప్పటికీ తాము స్వయంగా ఎన్నడూ ఎన్నికలలో పోటీ చేయని నేతలూ ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. తెలుగుదేశం పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ 2019 ఎన్నికలలో ఆ పార్టీ ఓటమి తరువాత బీజేపీలో చేరిన సీఎం రమేశ్ 2012 నుంచి 2024 ఏప్రిల్ వరకు రెండు పర్యాయాలు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుత ఎన్నికలలో ఆయన అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీ చేస్తున్నారు. ప్రత్యక్ష ఎన్నికలలో ఆయన పోటీ చేయడం ఇదే తొలిసారి. సీఎం రమేశ్ అనకాపల్లి నుంచి పోటీ చేస్తారన్న అంచనాల నేపథ్యంలోనే వైసీపీ కూడా ఆయనపై బలమైన అభ్యర్థిని ప్రకటించే ఉద్దేశంతో అక్కడి టికెట్ ఆలస్యం చేసింది. రమేశ్ పోటీ ఖరారైన తరువాత వైసీపీ తమ పార్టీ నుంచి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడిని అభ్యర్థిగా ప్రకటించింది. బడా కాంట్రాక్టర్‌గా పేరున్న సీఎం రమేశ్ పోటీ చేస్తుండడంతో అనకాపల్లి లోక్‌సభ స్థానంపై ప్రజల్లో ఆసక్తి ఏర్పడింది. అయిదేళ్ల కిందట తెలుగుదేశం నుంచి బీజేపీలో చేరిన ఈ వ్యాపారవేత్త రెండు సార్లు రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. కేంద్రంలో సహాయ మంత్రిగానూ పనిచేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో సుజనా చౌదరి విజయవాడ పశ్చిమ నియోజవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. వైసీపీ నుంచి షేక్ ఆసిఫ్ ఇక్కడ పోటీలో ఉన్నారు. ఇటు వైసీపీలో కీలకంగా ఉండడమే కాకుండా అటు కేంద్రంలోని బీజేపీ పెద్దలకూ దగ్గరగా కనిపించే రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో దిగారు. వైసీపీకే చెందిన మరో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కొద్ది కాలం కిందట టీడీపీలో చేరడం.. నెల్లూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తుండడంతో ఆయనపై పోటీగా విజయసాయిరెడ్డిని బరిలో దించింది వైసీపీ. కొద్దినెలల కిందట వరకు ఒకే పార్టీలో కలిసి పనిచేసిన ప్రభాకరరెడ్డి, విజయసాయి రెడ్డిలు ఇప్పుడు నెల్లూరులో ప్రత్యర్థులుగా పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. కాగా నెల్లూరు లోక్‌సభ స్థానంలో 2019లో వైసీపీ గెలిచింది. అంతకుముందు ఈ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేది. 1999లో ఒక్కసారి మాత్రమే ఇక్కడ టీడీపీ గెలిచింది. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విభాగాల నేషనల్ కోఆర్డినేటర్ కొప్పుల రాజు కాంగ్రెస్ పార్టీ నుంచి నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేస్తున్నారు. 1981 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన కొప్పుల రాజు 2013లో నేషనల్ అడ్వయిజరీ కౌన్సిల్ చైర్మన్‌గా ఉంటూ తన స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకున్నారు. అప్పటి నుంచి రాహుల్ గాంధీ టీంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో శాశ్వత ఆహ్వానితుడిగానూ ఉన్న కొప్పుల రాజు ప్రత్యక్ష ఎన్నికలలో పోటీ చేయడం ఇదే తొలిసారి. వైసీపీ అధ్యక్షుడు, ఏపీ సీఎం జగన్‌కు సొంత చెల్లెలైన వైఎస్ షర్మిల తొలిసారి ఈ ఎన్నికలలో పోటీ చేస్తున్నారు. కడప లోక్‌సభ స్థానం నుంచి ఆమె కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో ఉన్నారు. ఇక్కడ వైసీపీ సిట్టింగ్ ఎంపీ అవినాశ్ రెడ్డిపై ఆమె పోటీ చేస్తున్నారు. జగన్ అధికారంలోకి రావడానికి ముందు ఆయన విజయం కోరుతూ ఆంధ్రప్రదేశ్‌లో షర్మిల పాదయాత్ర చేశారు. అనంతరం వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటు చేసి తెలంగాణలోనూ పాదయాత్ర చేశారు. కానీ, 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆమె తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. అనంతరం ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. చాలాకాలంగా రాజకీయాలలో ఉన్న ఆమె తొలిసారి ఈ ఎన్నికలలో పోటీ చేస్తున్నారు.

## ఈ ఎన్నికల్లో గెలుపు పేదలదా...? పెత్తందార్లదా....?

(1వ పేజీ తరువాయి)

దేశంలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై యువతకు సరైన అవగాహన కొరవడుతుంది. పాఠశాల, కళాశాల స్థాయి నుండి ఓటు హక్కు పై అవగాహన పరుస్తూ నవతరాన్ని పోలింగ్ కేంద్రాల వరకు రప్పించాలి. అర్హులైన ఓటర్లను తొలగిస్తున్న రాజకీయ పార్టీల విధానాలను కట్టడి చేయాలి. ఇలా ఎన్నికల్లో అక్రమాలను కట్టడి చేస్తూ రాజకీయ పార్టీలు నైతిక విలువలకు కట్టుబడేలా ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరించాలి. ఈ ఎన్నికల్లో ప్రలోభాలో, భావోద్వేగాలో కాకుండా ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగా మారితేనే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడకుండా ప్రజలే అంతిమ విజేతలౌతారు. మన్నికైన పార్టీని నాయకున్ని ఎన్నుకున్న నాడే ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటాడు. వారే దేశాన్ని, రాష్ట్రాన్ని బాగు పరుస్తారు. ప్రజల బాధలు తీరుస్తారు. వారు మాట తప్పితే.. ఇంటికి పంపేలా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన ఓటు వజ్రాయుధం ఎట్లాగూ ఉండనే ఉంది. పార్టీల నేతలారా మారండి!. ప్రజలారా ఓటింగ్ శాతాన్ని పెంచండి. ఇది ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు..

## తల్లి మనసు గెలవలేని జగన్.. రాష్ట్ర ప్రజల మన్ననలు పొందగలడా..?



ప్రతి పార్టీ గెలుపే ధ్యేయంగా అడుగులేస్తోంది. ప్రతిపక్షాలు రానున్న ఎన్నికల్లో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తుంటే.. వైసీపీ అధికారం చేజారకుండా జాగ్రత్తపడుతోంది. అయితే ప్రతి పార్టీకి కుటుంబ సభ్యుల అండదండలు ఉన్నాయి. కానీ వైసీపీ అధినేత, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి మాత్రం సొంత కుటుంబ సభ్యులే శత్రువులుగా మారారు. గత ఎన్నికల్లో అన్న కోసం పోరాడిన వైఎస్ షర్మిల ఇప్పుడు అన్న పైనే పోరాటం చేస్తోంది. అన్నా చెల్లిల్ల మధ్యనే విభేదాలు అనుకున్న తరుణంలో తల్లి విజయమ్మకు కూడా జగన్మోహన్ రెడ్డి వైఖరి నచ్చలేదు అని తేలిపోయింది. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి తప్పదు అనే ప్రచారం జోరుగా సాగుతోంది. కన్న తల్లిని, సొంత చెల్లిని గాలికి వదిలేసిన సీఎం జగన్‌ను గెలిపిస్తే రాష్ట్రాన్ని గంగలో ముంచుతాడని, తల్లి, చెల్లి మీద లేని ప్రేమ రాష్ట్ర ప్రజలపైన ఎలా ఉంటుదని ప్రజలు సీఎం జగన్‌పై మండిపడుతున్నారు. కన్న తల్లి మనసు గెలవలేని జగన్, రాష్ట్ర ప్రజల మన్ననలు పొందగలడా..? ఎన్నికల్లో నెగ్గగలడా అనే అనుమానాలు సొంత పార్టీ నేతల్లోనే కలుగుతున్నాయని సమాచారం. కొడుకు, కూతురు ఇద్దరూ ఎన్నికల బరిలో తలపడుతున్న నేపథ్యంలో, విడవమంటే పాముకి కోపం, కరవమంటే కప్పకు కోపం, ఎందుకొచ్చిన తలనొప్పి అనుకున్న విజయమ్మ అటు కూతురుకి ఇటు కొడుకుకి సర్ది చెప్పలేక ఇటీవల అమెరికాకు వెళ్ళిపోయిన విషయం తెలిసిందే. అయితే తాజాగా కూతురు వైఎస్ షర్మిలను గెలిపించాలని విజయమ్మ మాట్లాడిన ఓ వీడియోను వైఎస్ షర్మిల తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. కాగా తన భర్త వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ప్రజలు ఆదరించారని, అలానే రాజశేఖర్ రెడ్డి కూడా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నారని వీడియోలో వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు. అప్పుడు ఎలాగైతే రాజశేఖర్ రెడ్డిని ఆదరించి ఒక అవకాశం ఇచ్చారో, ఇప్పుడు ఆయనలానే ప్రజలకు మంచి చేయడానికి ఎంపీ అభ్యర్థిగా కడప నుండి పోటీ చేస్తున్న రాజశేఖర్ రెడ్డి బిడ్డ వైఎస్ షర్మిలను సైతం అలానే ప్రజలు ఆదరించి గెలిపించాలని ఆ వీడియోలో వైఎస్ విజయమ్మ కోరారు. కాగా విజయమ్మ మాట్లాడిన ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎన్నికల సమయంలో కొడుకు కూతురు ఇద్దరు ఎన్నికల బరిలో ఉన్నప్పుడు వైఎస్ విజయమ్మ కూతురికి మాత్రమే మద్దతు ఇవ్వడం ప్రస్తుతం అటు రాజకీయ వర్గాల్లోనూ, ఇటు ప్రజల్లోనూ చర్చనీయాంశంగా మారింది. వైఎస్ షర్మిలకు విజయమ్మ మద్దతిస్తూ తన కూతురుని గెలిపించాలని కోరారు అంటే పరోక్షంగా జగన్‌ను ఓడించమని చెప్పినట్టే అని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల ప్రత్యేక అనుబంధ సంచిక

తేది : 13- 05-2024 ఆంధ్రలక్ష్మి 8 సంపుటి : 15 సంచిక : 34




ఎన్నికల సమయం. ఓటు హక్కు ఉన్నవాళ్లంతా ఓట్లు వేసేందుకు పోలింగ్ రోజు బూత్‌లకు క్యూకడుతుంటారు. ఓట్ల పండుగ అంటే చెప్పేదేముంది.. అంతా హడావుడి.. రకరకాల జనం ఓటు కోసం వస్తుంటారు. ఓటు వేయడానికి ఎన్నికల సంఘం పలు నిబంధనలు రూపొందించింది. ఓటు వేసే సమయంలో తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ రూల్స్ పాటించాల్సిందే. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయి. ఓటరు కాకపోతే పోలింగ్ బూత్‌లోకి ప్రవేశం ఉండదు. పోలింగ్ బూత్ సమీపంలో 144 సెక్షన్ అమలు చేస్తారు. ఎవరైనా గుంపులు గుంపులుగా వెళ్లినా.. న్యాసెన్స్ క్రియుట్ చేసినా వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకుంటారు. పోలింగ్ బూత్ సమీపంలో ఎలాంటి ప్రచారం చేయకూడదు. ఓటరు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకుని ఓటు వేయడానికి వెళ్లాల్సి ఉంటుంది. వేరే వాళ్ల ఓటు మరొకరు వేయడానికి ప్రయత్నించినా వెంటనే పోలీసులు అరెస్ట్ చేస్తారు. పోలింగ్ బూత్‌లోకి ఎలాంటి మొబైల్ ఫోన్లు, కెమెరా తీసుకెళ్లకూడదు. పోలింగ్ బూత్‌లో ఎన్నికల అధికారుల విధులకు ఓటరు ఆటంకం కలిగించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు. మద్యం తాగి ఓటు వేయడానికి వెళ్లినా.. పోలింగ్ బూత్‌లో ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదు. మద్యం తాగి పోలింగ్ బూత్ సమీపంలో న్యూసెన్స్ క్రియేట్ చేసినా చర్యలు తీసుకుంటారు. ఓటు వేయడానికి వెళ్లినప్పుడు మొబైల్ ఫోన్ పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్లకూడదు. పోలింగ్ బూత్ వరకు తీసుకెళ్లినా.. స్విచ్ఛాఫ్ చేసి ప్రిసైడింగ్ ఆఫీసర్ వద్ద డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఓటు వేసేటప్పుడు మొబైల్‌లో లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, కెమెరాల్లో షూట్ చేయకూడదు. ఓటును బహిరంగపర్చడం చట్టరీత్యా నేరం కావడంతో ఓటరు తాను ఓటు వేసేటప్పుడు.. దేనికి వేశారనే విషయాన్ని బహిరంగ పర్చేలా ఏపనిచేసినా నేరమే అవుతుంది. ఎవరైనా ఓటరు ఓటు వేసేటప్పుడు దానిని ఫోటో లేదా వీడియో తీస్తే ఆ ఓటరును పోలీసులు అదుపులోకి తీసుకుని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు. ఓటరు ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత వెంటనే పోలింగ్ బూత్‌ను వదిలి బయటకు వచ్చేయాలి. ఉద్దేశపూర్వకంగా ఎక్కువ సేపు అక్కడే నిల్చుని.. ఇతరులు ఓటు వేయకుండా ఆటంకం కలిగించినా చర్యలు తీసుకుంటారు. ఓటుకు నోటు తీసుకోవడం నేరం. ఎవరైనా డబ్బులు తీసుకుని ఓటు వేశారని రుజువైతే వారిపై చర్యలు తీసుకుంటారు. ఓటరు లిస్ట్‌లో ఎవరి పేరుందో ఆ వ్యక్తి మాత్రమే ఓటు వేయాలి. ఓటర్ల జాబితాలో పేరున్న వ్యక్తి బదులు వేరు వ్యక్తి ఓటు వేస్తే అతడిపై కేసు నమోదు చేస్తారు. దొంగ ఓట్లు వేయడం చట్టరీత్యా నేరం. అలాగే ఒక వ్యక్తి రెండు ఓట్లు వేయడం కూడా నేరంగానే పరిగణిస్తారు. ఒక వ్యక్తి దేశంలో ఒక ఓటు మాత్రమే కలిగి ఉండాలి. ఒకవేళ ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉన్నప్పటికీ.. కేవలం ఒకచోట మాత్రమే ఓటు హక్కు ఉపయోగించుకోవాలి. రెండూ చోట్ల ఓటు వేస్తే ఆవ్యక్తిపై చర్యలు తీసుకుంటారు. ఎన్నికల సంఘం నిబంధనలు పాటించి ఓటు వేస్తే ఎలాంటి చిక్కులు ఉండవు. పోలింగ్ రోజు ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలి.




ఎన్నికల్లో జరిగే అక్రమాలు, ప్రలోభాలు, నియమావళి ఉల్లం ఘనలు సహా అన్ని రకాల అంశాలను పరిశీలించే ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల పనితీరులో పారదర్శకత తీసుకువచ్చేందుకు వారి వినియోగించే వాహనాలను సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిని బట్టి ప్రతి నియోజకవర్గంలో గెజిటెడ్ అధికారులు నేతృత్వంలో ఫ్లయింగ్ స్క్వాడ్లు నియమి ంచారు. ప్రతి ఎనిమిది గంటలకు ఒక స్క్వాడ్ విధులు నిర్వ ర్తించేలా నియోజవర్గానికి ఆరు నుంచి తొమ్మిది మంది వరకు ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రతి నియోజవర్గంలో షాడో బృందంతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్ వినియోగించే వాహ నాలకు సీసీ కెమోరాలను ఏర్పాటుచేసి మరింతగా నిఘాను ఈసీ పెంచింది. రాజకీయ నాయకులు సమావేశాలు, సభలు, సభల్లో వారు వ్యవహరించే తీరును ఈ వాహనాలు సీసీ కెమెరాల ద్వారా నేరుగా జిల్లా, రాష్ట్ర ఎన్నికల అధికారులు పరిశీలించేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. ఈ వాహనాలకు జియోట్యాగ్ కూడా చేశారు. వీరి కదిలికపై కూడా ఉన్నతాధికా రులు పర్యవేక్షించేందుకు వీలుగా నిఘాపై నిఘా నేత్రం ఏర్పాటు చేశారు. నిఘా అధికా రులపై మరింత నిఘాను ఈసీ పెంచింది.

# అక్రమార్కులకు అడ్డాగా రాజకీయ పార్టీలు..!

గల్లీల్లో సిల్లీ నాయకులు తయారై ఏకంగా వ్యవస్థలనే శాసించే స్థాయికి ఎదిగిపోతున్నారు. ఇలాంటి గల్లీ నాయకులంతా ఏ పార్టీ అధికారంలో వుంటే... ఆ పార్టీలో చేరిపోతున్నారు. ఇంతకీ వీరి వృత్తి ఏమిటంటే... బెట్టింగ్‌లు, సింగిల్ నెంబర్ల ఆటలు... అక్రమ వడ్డీ వ్యాపారం, అక్రమ ఇసుక తరలింపు... గ్రావెల్ తరలింపు... ఇలా అక్రమార్జనతోనే ఖద్దరు నలగకుండా వీధికి పెద్దదిక్కుగా... పదిమందికి నాయకులుగా ఫోజులిస్తూ... ఎదిగిపోయిన అక్రమార్కుల చేతిలో ప్రజాస్వామ్యం అనునిత్యం అవమానాలపాతోందనేది కాదనలేని నిజం. చోటానాయకులు పేరుకేగాని, వీరు చేసే దందా పెద్దస్థాయిలోనే కొనసాగుతోంది. రోడ్డుమార్జిన్ వ్యాపారులవద్ద మార్జిన్ మనీ వసూలుచేయడంతో సహా... పోలీస్ స్టేషన్ల మామూళ్ళలో కూడా భాగస్వామ్యం పొందే స్థాయికి ఈ అక్రమార్కులు ఎదిగిపోయారంటే... రాజకీయ పార్టీలు ఏ దుస్థితిలో వున్నాయో ఇట్టే అర్థమైపోతుంది. ఈ అక్రమార్కులందరికీ రాజకీయ పార్టీలే అండగా నిలుస్తున్నాయని మేధావులు అంటున్నారు. ఏ పార్టీ అధికారంలో వుంటే... ఆ పార్టీలో చేరిపోయి తమ అక్రమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. వీరిలో పురుషులో అనుకుంటే పొరపాటే..! మహిళా నాయకురాళ్ళు కూడా వీధిరౌడీల్లా చెలామణీ అవుతున్నారు. వీరి అక్రమాలు పురుషులకు ఏమాత్రం తీసిపోకుండానే కొనసాగుతున్నాయి. తండల్ వ్యాపారం, చిట్టీల వ్యాపారం, చీర్ల వ్యాపారం, బంగారు వ్యాపారం అంటూ... ఆయా వీధుల్లో అమాయక మహిళలను వలలో వేసుకొని 'కాల్‌మనీ' వేధింపులకంటే ఘోరంగా మహిళలను వేధిస్తూ... తమ చేతిక్రింద వున్న రౌడీమూకలను వారి ఇళ్ళపై దౌర్జన్యాలకు పంపి కూలి నాలి చేసుకునే సామాన్యులను దోచుకుతింటున్న వైనం నెల్లూరు నగరంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. నెల్లూరు నగరంలో 54 డివిజన్లు వుంటే... ప్రతి డివిజన్‌కు అధికారంలో వున్న పార్టీ తరఫున రౌడీమూకలు తయారై చిల్లర నాయకుల వేషం వేసుకొని పోలీస్ స్టేషన్లలో దందాలు, రెవిన్యూ కార్యాలయాల్లో పనులు చేయిస్తామని సామాన్యులదగ్గర నగదు వసూళ్ళు, రేషన్‌కార్డులు ఇప్పిస్తామని ప్రజలను మభ్యపెట్టి వసూలు చేసుకొని పబ్బం గడుపుతూ... ఖద్దరు నలగకుండా ధర్జాగా జీవిస్తున్న ఈ అక్రమార్కులంతా రాజకీయ పార్టీల నీడ పెద్దమనుషుల్లా చెలామణి అవుతున్నారు. రాజకీయనాయకులు సైతం వీరికి అండగా ఉంటూ వీరి అక్రమాలను కొనసాగించేందుకు ఊతమిస్తున్నారు. అక్రమార్కులను అరికట్టాల్సిన నాయకులే ఇలాంటి అసాంఘిక శక్తులను, అక్రమార్కులను ప్రోత్సహించటంతో, వారికి అండగా ఉండటంతో అధికారులు సైతం వీరిని ప్రశ్నించేందుకు, మందలించేందుకు, అరికట్టేందుకు భయపడుతున్నారు. ఈ క్రమంలో ఈ అక్రమార్కుల దందాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. వీరంతా 20రూపాయలు, 10రూపాయలు వడ్డీ వ్యాపారాలు కొనసాగిస్తూ వుంటారు. ఇదే గాక రోజువారీ చిట్టీల పేరుతో ఆర్థిక లావాదేవీలు కొనసాగించి సామాన్యులను దోచుకోవడం వీరి వృత్తి. అలాగే వాహనాలను కొని అద్దెకు ఇస్తామంటూ అమాయకులకు అద్దెలకు ఇచ్చి అధిక వసూళ్లకు పాల్పడటం, ఎదురు తిరిగితే సంబంధిత బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌కు, పోలీసులకు ఫోన్‌చేసి అక్రమ కేసులతో వేధించటం వీరి పని. అలాగే చిన్న పొరపాటు జరిగి వాహనానికి ఏదైనా తగిలితే... ఇన్సూరెన్స్ మొత్తం కంపెనీ నుండి కాకుండా బాడుగదారు నుండి వసూలు చేసి వేధించటం వీరి నైజం. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి విషయంలోనూ అక్రమాలకు పాల్పడి దందాలు చేస్తూ... సామాన్యులను హింసిస్తున్న వారే రాజకీయనాయకుల అనుచరులుగా కొనసాగుతున్న వైనం నెల్లూరు నగరంలో స్పష్టంగా కనిపిస్తోంది. నెల్లూరు నగరంలో వీరి ఆధిపత్యం తారాస్థాయికి చేరి పోలీస్‌స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో దందాలు ముమ్మరంగా కొనసాగిస్తున్న వైనం పలువురు బాధితుల ఆందోళనతో వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రాంతం, ఒక డివిజన్ అనికాకుండా నగరం మొత్తం వీరి దందాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పురుషులైతే ఒకవిధమైన దోపిడీ, స్త్రీలైతే మరోవిధమైన దోపిడీ. వీరంతా సామాన్యులు నివశించే ప్రాంతంలోనే దందాలు కొనసాగిస్తుంటారు. వీరి టార్గెట్ రోడ్డుపై చిరువ్యాపారులు, రోజువారి కూలీలు, చిన్నపాటి ఉద్యోగులు వారి జీవితాల మీదనే వీరి జీవనాధారం ఆధారపడి వుంటుంది. వీరి అక్రమాలు, ఆధిపత్యం అలాంటి వారిమీదనే కొనసాగిస్తారు. వీరిని ఎవరూ వ్యతిరేకించకుండా, ఎదుర్కోకుండా, ప్రశ్నించకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల చెంతన చేరి తమ అక్రమాలను యథేచ్ఛగా కొనసాగిస్తుంటారు. ఎవరు అధికారంలో వున్నా... వీరి ప్రాబల్యం మాత్రం సమాజం నుండి పోవడంలేదనేది నిర్వివాదాంశం. మా పార్టీలోకి కండువా కప్పుకొని వచ్చాడంటూ... ప్రతి పార్టీ భుజాలు ఎగరేసుకుంటూ... ఇలాంటి అసాంఘిక శక్తులు అక్రమార్కులను పార్టీల్లో పోటీపడి చేర్చుకుంటున్న రాజకీయ పార్టీలు ఉన్నంతవరకు వీరిని అరికట్టలేమనేది నగ్నసత్యం..!

Edited, Printed, Published and Owned by Shaik Ghouse Basha, Printed at Mohammed Press, D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001, Andhra Pradesh, Publihsed at D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001. Andhra Pradesh,
Editor : Shaik Ghouse Basha Cell : 9640300529